

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శనివారం 04-02-2023 సంపుటి : 04 సంచిక : 142 పేజీలు : 4 వెల : రూ 3-00

## ప్రపంచ వేదికపై దేశం, ఆంధ్ర రాష్ట్ర జెండా ఎగురవేయాలి: సీఎం జగన్




తాడేపల్లి: అర్హులైన విద్యార్థులందరికీ జగనన్న విదేశీ విద్యా దీవెన కింద నిధులను ప్రభుత్వం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు ఉచిత విదేశీ విద్యను అందిస్తున్న విషయం తెలిసిందే.అంతర్జాతీయ స్థాయిలో టాప్-200 వర్సిటీల్లో ఉచిత ఉన్నత విద్య అడ్మిషన్లు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడతలో సాయంగా రూ. 19.95 కోట్లను బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లోకి డబ్బులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జమ చేశారు.ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. జగనన్న విదేశీ విద్యా దీవెన రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం. మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము. పేద విద్యార్థులు ప్రపంచంలోనే టాప్ వర్సిటీల్లో చదువుకునే అవకాశం కల్పించాము. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల పేద విద్యార్థులకు అవకాశం ఇచ్చాము. పేదల చదువుకు పేదరికం అడ్డుకాకూడదు. పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువే. విదేశీ వర్సిటీల్లో 213 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరికి తొలివిడతగా రూ.19.95 కోట్ల సాయం అందిస్తున్నాము. ప్రపంచ వేదికపై దేశం, ఆంధ్ర రాష్ట్ర జెండా ఎగురవేయాలి. మన పిల్లలు ప్రపంచ స్థాయిలో రాణించాలని ఆకాక్షించారు.చిత్తశుద్ధితోనే పరిస్థితులు మార్చాలనే తాపత్రయం నుంచి ఈ ఆలోచన వచ్చింది. మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది. విద్య మీద పెట్టే ప్రతి పెట్టుబడి కూడా మానవ వనరుల మీద పెట్టినట్టే. కుటుంబాల తలరాతలే కాదు.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి తలరాతలు కూడా మారుస్తాయి. మహాత్మ గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, అంబేద్కర్ వంటి వాళ్లు పెద్ద యూనివర్శిటీల నుంచి వచ్చినవారే. అందుకే పిల్లలు చదువుకునేలా అడుగులు వేయిస్తున్నామని అన్నారు.గతంలో కేవలం రూ. 10లక్షలు మాత్రమే ఇచ్చేవారు. 2016-17కి సంబంధించి రూ.300 కోట్లు బకాయిలు పెట్టారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్లు, మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ.కోటి వరకు సాయం అందిస్తున్నాము. ట్యూషన్ ఫీజు వందశాతం రీయింబర్స్‌మెంట్స్ ఇస్తున్నామన్నారు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే సీఎంఓలో అధికారులు అందుబాటులో ఉంటారు. ఇబ్బంది ఉంటే వెంటనే కాల్ చేయండి. ప్రతీ విషయంలో మీకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

## పార్లమెంట్‌లో 'అదానీ' రభస..

### ఉభయసభలు సోమవారానికి వాయిదా



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ గౌతమ్ అదానీ వ్యవహారం పార్లమెంటును కుదిపేసింది. మార్కెట్‌లలో అదానీ గ్రూప్ డీలాపడినందున ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీ భారీగా నష్టపోయే ప్రమాదం ఉండటంతో లోక్‌సభలో, రాజ్యసభలో అదానీ వ్యవహారంపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం అంశాలపై కూడా చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దాంతో ఉభయసభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.లోక్‌సభలో స్పీకర్, రాజ్యసభలో చైర్మన్ సభను కంట్రోల్‌లో పెట్టే ప్రయత్నం చేసినా సాధ్యంకాలేదు. దాంతో లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు, రాజ్యసభ మధ్యాహ్నం 2.30 గంటల వరకు వాయిదాపడ్డాయి. తర్వాత రెండు సభలు ప్రారంభమైనప్పటికీ సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో ఉభయసభలను ఈ నెల 6వ తేదీకి (సోమవారానికి) వాయిదా వేశారు.

## ఏకో ఇండియాతో ఏపీ వైద్య ఆరోగ్య శాఖ ఎంవోయూ

అమరావతి: రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, ఆరోగ్య కార్యకర్తల సామర్థ్యం పెంపుదల కార్యక్రమాల అమలుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నేషనల్ హెల్త్ మిషన్..న్యూఢిల్లీకి చెందిన ఎకో ఇండియా సంస్థతో అవగాహనా పత్రంపై(ఎంవోయూ) సంతకాలు చేసింది. శుక్రవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనం, ఐదో అంతస్థులో తన ఛాంబర్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ మరియు ఎన్ హెచ్ఎం మిషన్ డైరెక్టర్ జె. నివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్ బిఎస్ హెచ్ దేవి, ఎకో ఇండియా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సందీప్ భల్లా, డిప్యూటీ జనరల్ మేనేజర్ దీపా ఝా ఈ అవగాహనా పత్రంపై సంతకాలు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ భల్లా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఎకో ఇండియా సంస్థల మధ్య కుదిరిన ఈ భాగస్వామ్య ఒప్పందం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను ప్రభావశీలంగా నిర్వహించటానికి దోహదపడుతుందని చెప్పారు. వైద్య ఆరోగ్య రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై సిబ్బందికి ఉచితంగా వర్చువల్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ అవగాహనా పత్రంపై సంతకాలు జరగటానికి ముందు ఎకో ఇండియా బృందం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎంటి కృష్ణబాబుతో భేటీ అయ్యింది. ఈ భాగస్వామ్య ఒప్పందానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఆయన ఎకో ఇండియా బృందానికి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు కుదిరిన ఈ ఒప్పందంపై ఆయన హర్షాన్ని వ్యక్తం చేశారు.



## ఫోన్ ట్యాపింగ్ కాదు.. చంద్రబాబు మ్యాన్ ట్యాపింగ్ చేశారు: కోటంరెడ్డిపై మంత్రి కాకాణి ఫైర్




నెల్లూరు: 2014 ఎన్నికల సమయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం విషయంలో ఎంత పోటీ ఉ ందనేది కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి తెలుసని, ఆనాడు జగన్‌మోహన్‌రెడ్డి స్థానంలో ఎవరున్నా కోటంరెడ్డికి సీటు దక్కి ఉండేది కాదని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు.శుక్రవారం ఉదయం కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాతిక్రేయ సమావేశం నిర్వహించగా.. దానికి కౌంటర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు కాకాణి.పార్టీ మారాలనేది కోటంరెడ్డి వ్యక్తిగత విషయం. కానీ, వైఎస్ఆర్‌సీపీపై బురద జల్లడం సరికాదు. అక్కడ జరిగింది ఫోన్ ట్యాపింగ్ కాదు.. మ్యాన్ ట్యాపింగ్ జరిగింది. చంద్రబాబు నాయుడు, కోటంరెడ్డిని ట్యాప్ చేశారు. చంద్రబాబు ట్రాప్‌లో పడ్డారు కోటంరెడ్డి. ఒకవేళ నిజంగా ట్యాపింగ్ జరిగి ఉంటే.. అవమానం, అనుమానం అనే బదులు విచారణకు ముందుకు వెళ్లొచ్చు కదా అని కాకాణి పేర్కొన్నారు.ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై ఇన్నిరోజులు కోర్టుకు ఎందుకు వెళ్లలేదు. కేంద్రానికి ఫిర్యాదు చేస్తానని చెప్పావు.. ఏమైంది?. అది ఆడియో రికార్డ్ అని తెలుసు కాబట్టే అవమానించారని డ్రామాలు ఆడుతున్నావు అంటూ కోటంరెడ్డిపై మండిపడ్డారు మంత్రి కాకాణి. టీడీపీ అభ్యర్థిగా ఖరారైన తర్వాతే ఆరోపణలు చేస్తున్నావ్. కోటంరెడ్డి నువ్వు వీరవిధేయుడివి కాదు.. వేరే వాళ్లకు విధేయుడివి. సీఎం జగన్ టికెట్ ఇచ్చారు కాబట్టే.. ఎమ్మెల్యే అయ్యావు. ఈ స్థితిలో ఉండడానికి ఆయన కారణం కాదా?. సీఎం జగన్ 1 అయితే.. ఆ ముందు ఉండే సున్నాలం మనం. ఆ ఒక్కటే లేకపోతే.. మనమంతా జీరోలం. ఒకరిద్దరు పార్టీ నుంచి వెళ్లిపోయినంత మాత్రాన వైసీపీకి నష్టం లేదు. అంతకంటే మంచి నేతలు పార్టీలోకి వస్తారు. కోటంరెడ్డి తీసుకున్న నిర్ణయం ఆత్మహత్యా సదృశ్యంగా మారబోతోందని కాకాణి జోస్యం పలికారు.

## లోకేశ్ బహిరంగసభను అడ్డుకున్న పోలీసులు..

### బంగారుపాళ్యంలో ఉద్రిక్తత



ఐరాల: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యం కూడలి వద్దకు చేరుకున్నారు.బంగారుపాళ్యం కూడలిలో బహిరంగసభను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఓ వైపు వందలాది మంది పోలీసులు.. మరో వైపు భారీగా చేరుకున్న తెదేపా శ్రేణులు బంగారుపాళ్యం కూడలికి చేరుకోవడంతో తోపులాట జరిగింది. సభకు అనుమతిలేదని, ప్రజలతో ముఖాముఖి నిర్వహించేందుకు మాత్రమే అనుమతి ఉందని పోలీసులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఎలాగైనా లోకేశ్ బహిరంగ సభను నిర్వహించాలని కార్యకర్తలు పట్టుదలతో ఉన్నారు.లోకేశ్ పాదయాత్ర ఎనిమిదోరోజు పూతలపట్టు నియోజకవర్గంలో ప్రారంభమైంది. మొగిలి నుంచి ఇవాళ ఉదయం పాదయాత్ర ప్రారంభించే ముందు సెల్ఫీ విత్ లోకేశ్ కార్యక్రమం నిర్వహించారు. లోకేశ్‌ను కలవడానికి వచ్చిన ప్రజలు, అభిమానులు, కార్యకర్తల్ని కలిసి సెల్ఫీలు దిగారు. మొగిలి నుంచి 10 కిలోమీటర్లు సాగిన పాదయాత్రం శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యం చేరుకుంది.

## ప్రతి విద్యార్థి జాతీయ సేవా పథకంలో భాగస్వాములు కావాలి

### ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్

అమరావతి విద్యార్థుల ప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసమే అయినప్పటికీ, సంఘసేవను సైతం అలవరుచుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. చదువుకు ఆటంకం లేకుండా సేవ చేసే అవకాశాన్ని అందించే జాతీయ సేవా పథకంలో శిఎన్ఎస్ఎస్‌రి లో ప్రతి ఒక్క విద్యార్థి భాగస్వాములు కావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి గణతంత్ర దినోత్సవ వేడుకల కవాతులో భాగస్వామ్యం వహించిన జాతీయ సేవా పథకం విధ్యార్థులు శుక్రవారం రాజ్ భవన్ లో గవర్నర్ తో సమావేశమై తమ అనుభవాలను పంచుకున్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా వారు సమాజానికి అందించిన సేవను గవర్నర్ దృష్టికి తీసుకువచ్చారు. కవాతు శిక్షణ ఏలా సాగిందన్న దానిని వివరించారు. ఈ సందర్భంగా హరిచందన్ మాట్లాడుతూ ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణమని జాతీయ సేవా పథకం విద్యార్ధులు దీనిని ఆచరించటం ముదావహమన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జాతీయ సేవా పథకం ద్వారా మరిన్ని అవార్డులు సాధించాలని గౌరవ గవర్నర్ ఆకాంక్షించారు. ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మేలు జరిగేలా విభిన్న కార్యక్ర మాలను అమలు చేస్తుంద న్నారు. జాతీయ సేవా పథకంను ప్రోత్సహిస్తున్నా మని, ప్రతి విద్యార్థిలోనూ సేవతత్పరత పెంపొందించేలా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. గవర్నర్ ను కలిసిన వారిలో జాతీయ అవార్డు గ్రహీతలు రాష్ట్ర ఎన్ ఎస్ ఎస్ అధికారి



డాక్టర్ పి అశోక్ రెడ్డి, జితేంద్ర గౌడ్, పార్థసారథి,సిరి దేవనపల్లి, డి. సాయి కవాతులో పాల్గొన్న వందన, భువనేశ్వరి, రమ్య, మహాలక్ష్మి, దేదీప్య, వివిఎస్ఎన్ లక్ష్మణ్, జిజి దీపక్ రెడ్డి, బి.గోపి, ఎస్ రెడ్డి జిష్ణు, జె. వాసు, ఎన్ ఎస్ ఎస్ ఇటిఐ సమన్వయకర్త డాక్టర్ రామచంద్ర రావు ఉన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా, సంయిక్త కార్యదర్శి సూర్య ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## కళాతపస్వి కె.విశ్వనాథ్ కన్నుమూత

హైదరాబాద్ ప్రముఖ దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్ (92) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. దీంతో టాలీవుడ్లో విషాదం అలముకుంది. కె.విశ్వనాథ్ స్వస్థలం గుంటూరు జిల్లా



రేపల్లె మండంలోని పెద పులివర్రు గ్రామం. 1930 ఫిబ్రవరి 19న కాశీనాథుని సుబ్రహ్మణ్యం, సరస్వతమ్మ దంపతులకు విశ్వనాథ్ జన్మించారు. కె.విశ్వనాథ్కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. తెలుగు చిత్రపరిశ్రమకు ఒక గొప్ప గౌరవాన్ని తీసుకొచ్చిన ఆయన 50కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించారు.1980 లో అయన తీసిన శంకరాభరణం సినిమా ఎంత సంచలనం సృష్టించిందో అందరికి తెలుసు. ఆత్మగౌరవం సినిమా అయన తొలి చిత్రం. సాగరసంగమం, శృతి లయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం లాంటి ఎన్నో గొప్ప చిత్రాలు తీశారు.సినిమా రంగంలో ఆయన చేసిన కృషికి 2016లో సినిరంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చింది. 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారం, పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. దీంతోపాటు జాతీయ పురస్కారాలు, నంది అవార్డులు ఆయనకు దక్కాయి. కె.విశ్వనాథ్ మృతికి మెగాస్టార్ చిరంజీవి తీవ్ర దిగ్భ్రాంతికళాతపస్వి కె.విశ్వనాథ్ మృతికి మెగాస్టార్ చిరంజీవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నా తెలుగు చిత్రాల స్థాయిని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లిన గొప్ప దర్శకులు విశ్వనాథ్ గారు కాలం చేయడం నన్ను కలచి వేసింది. ఈరోజు ఆయన కన్నుమూసిన వార్త విన్న నేను షాక్ కు గురయ్యాను. ఆయన లాంటి డైరెక్టర్ కన్నుమూయటం నాకే కాదు తెలుగు సినీ పరిశ్రమకే తీరని లోటు. ఈ సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తి ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు.

## అవినాష్‌రెడ్డి కాల్ రికార్డుల్లో సంచలనం ఏమీ లేదు: సజ్జల

అమరావతి: అవినాష్‌రెడ్డి కాల్ రికార్డులో సంచలనం ఏమీ లేదని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'అవినాష్‌రెడ్డి ఫోన్‌ను ఆరోజే పోలీసులు చెక్ చేశారు.నాలుగు రోజుల నుంచి తెగ ప్రచారం చేస్తున్నారు. కుట్ర కోణం ఉందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని మండిపడ్డారు."సీఎం జగన్‌తో మాట్లాడేందుకు నవీన్‌కు అవినాష్ ఫోన్ చేశారు. నవీన్ సీఎం జగన్ ఇంట్లో అటెండర్. సీఎం జగన్ దగ్గర ఫోన్ లేకపోవడంతో నవీన్‌కు ఫోన్ చేశారు. సమాచారం ఇచ్చేందుకు సిబ్బందికి ఫోన్ చేయడం సాధారణమే. ఈ విషయంపై ఎల్లో మీడియా రాద్ధాంతం చేస్తోంది. విచారణకు పిలిస్తే హాజరయ్యారు. దీనిలో కొత్త కోణం ఏముంది?. చంద్రబాబు చేసే నీచ రాజకీయాల్లో ఇదో పార్ట్. ఒంటిచెత్తో చప్పట్లు కొట్టి సౌండ్ చేసే సత్తా బాబుకు ఉంది" అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు.



# సంపాదకీయం

శనివారం 04-02-2023

## ఓ శిఖరం మూగబోయింది

భారతీయ సంస్కృతికి చిహ్నమైన శాస్త్రీయ కళలను తన కథలుగా మలుచుకుని, అద్భుతమైన చిత్ర కావ్యాలను తెరకెక్కించి కె. విశ్వనాథ్ కళాతపస్వి అనిపించుకున్నారు అయన ఆవిష్కరించిన శంకరాభరణం సినిమా జాతీయ పురస్కారాన్ని అందుకుని తెలుగుతెరపై ఒక కళాఖండంగా మిగిలిపోయింది. అలాగే, స్వాతిముత్యం, సాగరసంగమం, స్వయంకృషి, స్వర్ణకమలం, సిరివెన్నెల.. ఇలా ఆయన ప్రతి చిత్రం తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఇంతటి గొప్ప చిత్రాలు అందించినందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ఆయన్ని పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే తదితర అవార్డులతో సత్కరించింది. కానీ, తన సినిమాలతో ప్రేక్షకుల మనసుని తేలికపరిచే విశ్వనాథ్ మనసుని మాత్రం ఒక సినిమా చిత్రవధ చేసిందట. అదే 'సిరివెన్నెల' సినిమా. ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ఆయనే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. 'మిమ్మల్ని బాగా తృప్తిపరిచిన సినిమా ఏది' అని ప్రశ్నించగా.. విశ్వనాథ్ బదులిస్తూ, 'కళాకారుడు అనేవాడు జీవితాంతం తృప్తి పొందడు. ఇంకా ఏదో చేయాలి, సాధించాలనే అసంతృప్తితోనే బతుకుతాడు. నేను అంతే. కానీ, నన్ను మానసికంగా చాలా సంఘర్షణకు గురిచేసిన సినిమా మాత్రం 'సిరివెన్నెల'. అసలు ఒక మాటలు రాని అమ్మాయి ఏంటి.. కళ్లు కనబడని అబ్బాయి ఏంటి.. వారిద్దరి మధ్య సన్నివేశాలు సృష్టించడానికి నేను రాత్రి పగలు కష్టపడడం ఎందుకు? ఆ కథ ఎందుకు మొదలుపెట్టానా అని ఎంతో బాధపడ్డా. తెలుగు చలన చిత్ర పరిశ్రమ మరో దర్శక దిగ్గజాన్ని కోల్పోయింది. లెజెండరీ ఫిల్మ్ మేకర్, కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్ గురువారం రాత్రి కన్ను మూశారు. ఆయన మరణంతో భారతీయ చిత్రసీమ తీవ్రగ్భ్రాంతికి గురైంది. ఒక్కసారిగా షాక్ తిన్నది. విశ్వనాథునితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు ఈ బాధను తట్టుకునే శక్తి ఆయన కుటుంబ సభ్యులకు ఇవ్వాలని కోరుకుంటూ భగవంతుడిని ప్రార్థిస్తున్నారు. నివాళులు అర్పిస్తున్నారు. విశ్వనాథ్ మృతి పట్ల మెగాస్టార్ చిరంజీవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ "నా తెలుగు చిత్రాల స్థాయిని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లిన గొప్ప దర్శకులు విశ్వనాథ్ గారు. ఆయన కాలం చేయడం నన్ను కలచి వేసింది. ఈ రోజు ఆయన కన్నుమూసిన వార్త విని షాక్ కు గురి అయ్యాను. ఆయన లాంటి దర్శకుడు కన్ను మూయటం నాకే కాదు... తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటు. ఈ సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తి ఇవ్వాలని కోరుకుంటున్నాను" అని సంతాపం వ్యక్తం చేశారు. "తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలుగా వ్యాపింపజేసిన వారిలో విశ్వనాథ్ గారిది ఉన్నతమైన స్థానం. 'శంకరాభరణం', 'సాగర సంగమం' లాంటి ఎన్నో అపురూపమైన చిత్రాలను మనకు అందించారు. ఆయన లేని లోటు ఎన్నటికీ తీరనిది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ... ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను" అని ఎన్టీఆర్ ట్వీట్ చేశారు."శ్రీ కె. విశ్వనాథ్ గారి మరణ వార్త విని నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురి అయ్యాను. ఆయన దర్శకత్వంలో 'స్వాతి కిరణం' చేయడం నాకు లభించిన అదృష్టంగా, గౌరవంగా భావిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను" అని మమ్ముట్టి ట్వీట్ చేశారు. విశ్వనాథ్ మరణం పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 'ఆత్మ గౌరవం'తో దర్శకుడిగా పరిచయమైన విశ్వనాథ్, ఆ తర్వాత సుమారు 50 చిత్రాలకు దర్శకత్వం వహించారు. పలు సినిమాల్లో నటించారు. ఆయనకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చింది. భారత ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీతో సత్కరించింది. 'శంకరాభరణం', 'స్వాతి ముత్యం', 'సిరిసిరిమువ్వ', 'సప్తపది', 'స్వర్ణ కమలం', 'సాగర సంగమం', 'శృతి లయలు', 'సిరివెన్నెల', 'స్వయం కృషి' వంటి ఉన్నతమైన చిత్రాలను ఆయన అందించారు. విశ్వనాథ్ స్వస్థలం గుంటూరు జిల్లాలోని రేపల్లె. ఆయన ఫిబ్రవరి 19, 1930లో జన్మించారు. ఆయన పూర్తి పేరు కాశీనాథుని విశ్వనాథ్. గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్, ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీలో బీఎస్సీ చేశారు. ఆయన తండ్రి కాశీనాథుని సుబ్రహ్మణ్యం మద్రాసులోని వాహిని స్టూడియోస్ లో పని చేసేవారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత విశ్వనాథ్ కూడా అందులో ఉద్యోగానికి వెళ్లారు. సౌండ్ రికార్డిస్ట్ గా కెరీర్ స్టార్ట్ చేసి, ఆ తర్వాత దర్శకత్వం వైపు అడుగులు వేశారు. మన సినిమా పరిశ్రమ ఎప్పటికీ గర్వంగా చెప్పుకొనే సినిమాల్లో ఒకటైన 'పాతాళ భైరవి' చిత్రానికి ఆయన దర్శకత్వ శాఖలో పని చేశారు. చిత్రీకరణ మధ్యలో సినిమాను ముగించలేను, ఆపేయలేను.. ఆ సమయంలో మానసికంగా ఎంతో చిత్రవధ అనుభవించా'.. అంటూ విశ్వనాథ్ తన అనుభవాన్ని పంచుకున్నారు. కట్ చేస్తే.. సిరివెన్నెల సినిమా తెలుగుతెరపై మరో కళాఖండమైంది.

# వైసీపీకి కృష్ణా తలనొప్పి

విజయవాడ, ఫిబ్రవరి 3, నాని, వంశీలపై కొందరు వైసీపీ లీడర్లు చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఇప్పుడు ఈ కామెంట్స్ ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైరల్‌గా మారుతున్నాయి. దీని వల్లభనేని వంశీ ఘాటుగా రియాక్ట్ అయ్యారు. పార్టీ పరంగా చేయాల్సింది చేస్తుందని అన్నారు. అయితే వ్యక్తిగతంగా తమ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయాలని చూసిన వాళ్ల డొక్కను పగల్‌దీస్తామన్నారు. టీడీపీ టికెట్‌పై గెలిచిన వల్లభనేని వంశీ... వైసీపీకి దగ్గరయ్యారు. దీంతో ఆయనపై నియోజకవర్గంలో ఓడిన ప్రత్యర్థులంతా ఒక్కటయ్యారు. వంశీకి వైసీపీకి దగ్గరైనప్పటి ప్రత్యర్థులైన దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు పొసగడం లేదు. సమయం చిక్కినప్పుడల్లా వంశీకి వ్యతిరేకంగా వీళ్లిద్దరూ కామెంట్స్ చేస్తుంటారు. అదే మాదిరిగా ఓ సమావేశంలో కలిసిన దుట్టా, యార్లగడ్డ.. పిచ్చాపాటిగా మాట్లాడుతూ కొడాలి నాని, వంశీపై విమర్శలు చేశారు. మాజీ మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఉద్దేశించి దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు అసహన వ్యాఖ్యలు చేశారు. గుంటూరు జిల్లా వైకుంఠపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వైఎస్ఆర్ సీపీ నేతలు పాల్గొని చేసిన కామెంట్స్‌ను అక్కడే ఉన్న వాళ్లెవరో రికార్డు చేసి వైరల్ చేశారు. యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ఆ కొడాలి నానీ ఏడో తరగతి తప్పిన వెధవ అని వ్యాఖ్యలు చేశారు. "వాడు ఎంతసేపూ సినిమాలంటాడు. ఏ సినిమాలోనైనా ఏం ఉంటుంది. సినిమా మొత్తం హీరో కంటే విలన్‌కే ఎక్కువ క్రేజ్ ఉంటుంది. చివరికి క్లైమాక్స్‌లో హీరో చేతిలో చెంపదెబ్బ తినడం రొటీన్. వాడి వల్ల గుడివాడ నియోజకవర్గానికి ఏం ఉపయోగం? అసలు వంశీ, నానీ ఏ బిజినెస్ చేసి డబ్బులు సంపాదించారు?" అని యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యానించారు. వల్లభనేని వంశీ గురించి మరో నేత దుట్టా రామచంద్రరావు మాట్లాడుతూ.. వంశీ ఆగడాలను తామే ప్రశ్నించామని, అందుకే తమకు ప్రజల్లో మంచి గుర్తింపు వచ్చిందని మాట్లాడారు. మీడియాను మేనేజ్ చేయడంలో వంశీ దిట్ట అంటూ యార్లగడ్డ వెంకట్రావ్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందించిన వల్లభనేని వంశీ తమ ఇమేజ్‌ను డ్యామేజ్ చేసిన వారి డొక్క పగల్‌దీస్తామన్నారు. పార్టీ మీద గౌరవంతో తలొంచుకొని ప్రత్యర్థులను కూడా కలుపుకొని పని చేయడానికి ప్రయత్నిస్తున్నానని అన్నారు. తన చేతిలో ఒక్కొక్కరిగా వచ్చి ఓడిపోయారని...

గుంపులుగా కూడా చతికిల పడ్డారని ఇప్పుడు మాత్రం ఏ చేస్తారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై పార్టీ పరంగా అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. వ్యక్తిగతంగా ఇమేజ్‌ను డ్యామేజ్ చేసినందుకు ఏం చేయాలని తాను, కొడాలి నాని ఆలోచించుకుంటామన్నారు. ఏం చేయాలో అది చేస్తామన్నారు. ఆస్తులపై మాట్లాడి వారికి కాస్తైనా బుద్ధి ఉండాలన్నారు వంశీ. తాను, కొడాలి నాని కొన్ని సంవత్సరాల నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని... అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు ఉంటాయని అనుమానం ఉన్న వాళ్లు చూసుకోవచ్చన్నారు. ఇప్పటికే నెల్లూరు పంచాయితీతో సతమతమవుతున్న వైసీపీ అధిష్ఠానానికి ఇదో కొత్త తలనొప్పిగా మారుందనే టాక్ వినిపిస్తోంది. ఈ రెండు వర్గాల మధ్య ఎప్పటి నుంచో విభేదాలు ఉన్నప్పటికీ వాటిపై సీరియస్‌గా దృష్టి పెట్టని వైసీపీ అధినాయకత్వం ఈ సారి మాత్రం కచ్చితమైన నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది.

# మాగుంటకు మళ్లీ టిక్కెట్ లేనట్టేనా

ఒంగోలు, ఫిబ్రవరి 3,ఎంపీ మాగుంట స్థానంలో వచ్చే ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రశాంతికి వైసీపీ టిక్కెట్ కేటియిస్తారని వైసీపీ నేతలు చెబుతున్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లాబీయింగ్‌తో పాటు ఇతరత్రా కారణాల నేపథ్యంలో ప్రశాంతికి ఎంపీ టిక్కెట్ దక్కుతుందని చెబుతున్నారు. సుదీర్ఘ కాలంలో రాజకీయాల్లో ఉన్న మాగుంట శ్రీనివాసుల రెడ్డి 2014లో రాష్ట్ర విభజన తర్వాత టీడీపీలో చేరారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ అయ్యారు. 2019లో వైసీపీలో చేరిన మాగుంట ఒంగోలు ఎంపీగా రెండు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. జిల్లా రాజకీయ సమీకరణల నేపథ్యంలో మాగుంట అన్ని వర్గాలకు దూరం అయ్యారు. ముఖ?యంగా జిల్లాలో బాలినేని వర్గంతో మాగుంటకు విభేదాలు తలెత్తాయి. లిక్కర్ వ్యాపారాల్లో ఆరితేరన మాగుంట కుటుంబం ఇటీవల ఢిల్లీ లిక్కర్ స్కాంలో తెరపైకి వచ్చింది. ఆ కుంభకోణంతో తమకు సంబంధం లేదని మాగుంట తేల్చి చెప్పినా సిబిఐ నమోదు చేసిన అభియోగపత్రాల్లో మాగుంట కుటుంబ సభ్యుల్ని చేర్చారు. మరోవైపు జిల్లాలో ఇతర నేతలతో సయోధ్య లేకపోవడంతో వచ్చే ఎన్నికల్లో ఒంగోలు స్థానానికి ఇతరులతో పోటీ చేయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఎంపీ మాగుంట శ్రీనివాస్ సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్నా పెద్దగా వివాదాల్లోకి రాలేదు. అన్న మరణం తర్వాత రాజకీయాల్లోకి వచ్చినా తమ వ్యాపారాలకే ఆయన ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారు. కాంగ్రెస్, టీడీపీలలో కొనసాగినా క్రియాశీల రాజకీయాల్లో పెద్దగా ఆయన పేరు వినిపించేది కాదు. దక్షిణాది రాష్ట్రాల్లో మద్యం డిస్టిలరీలలో తిరుగులేని ఆధిపత్యం కలిగి ఉన్న మాగుంట కుటుంబానికి ఇన్నాళ్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగిపోయింది. ఇటీవలి కాలంలో ఒంగోలులో బాలినేని శ్రీనివాసరెడ్డితో మాగుంటకు విభేదాలు తలెత్తాయి. బాలినేని వివాదాల్లో చిక్కుకోవడానికి మాగుంటే కారణమని ప్రచారం జరిగింది. దీంతో బాలినేని సొంత పార్టీ వారే తనపై కుట్రలు చేస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే కాళ్లు విరగ్గొడతానని వార్నింగ్ ఇచ్చారు. ఆ తర్వాత వివాదం సద్దుమణిగిన వైసీపీలో మాగుంటకు ఇబ్బందులు తప్పడం లేదనే ప్రచారం కూడా ఉంది. వచ్చే ఎన్నికల్లో తన బదులు తన కుమారుడు రాఘవరెడ్డి ఒంగోలు పార్లమెంటు స్థానాన్ని కేటాయించాలని మాగుంట కోరుతున్నారు. దీనిపై వైసీపీ అధిష్టానం ఎలాంటి హామీ ఇవ్వకపోవడం ఆయన్ని మనస్తాపానికి గురి చేసినట్లు చెబుతున్నారు. అటు బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా తన కొడుకు ప్రణీత్‌ను ఒంగోలు నుంచి బరిలో దింపాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలినేనితో సరిపడక మాగుంట పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతున్న సమయంలో బీజేపీ ఆయన్ని టార్గెట్ చేసింది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి 2014కు ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వైఎస్ మరణం తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ వర్గంగా జగన్‌కు దూరంగా ఉండిపోయారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి ఎమ్మెల్సీ అయ్యారు. 2019ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. ఒంగోలు నుంచి ఎంపీగా గెలిచారు. 2019కు ముందు వరకు వివాదాలకు చాలా దూరంగా ఉంటూ వచ్చారు. 2019 తర్వాత ఆయనకు చిక్కులు మొదలయ్యాయి. ఈ సారి వద్దనుకున్నా వివాదాలు చుట్టుముడుతున్నాయి. జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలతో ఎంపీకి పొసగడం లేదు. టీడీపీ, బీజేపీలలో చేరుతారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారాలను మాగుంట ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నారు. తాజాగా మాగుంట స్థానంలో వేమిరెడ్డి ప్రశాంతికి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానం భావిస్తోందని నేతలు చర్చలేవనెత్తారు. అదే సమయంలో ఒంగోలు ఎమ్మెల్యే టిక్కెట్ బాలినేని, వైవీ సుబ్బారెడ్డిల్లో ఒకరికి దక్కుతుందని చెబుతున్నారు. జిల్లాలో అసమ్మతి నేతలకు చెక్ పెట్టేలా వైసీపీ అధిష్టానం పావులు కదుపుతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# కోటగిరి వారసుల రచ్చ

ఏలూరు, ఫిబ్రవరి 3, స్థానిక సంస్థల ఎన్నికల వేళ పశ్చిమ గోదావరి జిల్లాలో అధికార వైసీపీ ఎంపీ ఇంట్లోనే ముసలం మొదలైంది. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు, ఆయన సోదరి అయిన ఈస్ట్ యడవల్లి ( కోటగిరి స్వగ్రామం) మాజీ సర్పంచ్ పొన్నాల అనితకు మధ్య తీవ్రమైన వార్ నడుస్తోంది. కొద్ది రోజులుగానే వీరి మధ్య నివురు గప్పిన నిప్పులా ఉన్న ఈ అసమ్మతి జ్వాలలు స్థానిక సంస్థల ఎన్నికల వేళ బహిర్గతమవుతున్నాయి. చివరకు ఈ అన్నాచెల్లెల యుద్ధంలో ఎవరికి వారు పైచేయి సాధించే క్రమంలో ఒకరి మాట మరొకరు వినే పరిస్థితి కూడా చేయిదాటిందని తెలుస్తోంది. వీరి తండ్రి అయిన దివంగత మాజీ మంత్రి కోటగిరి విద్యాధరరావు జీవించి ఉన్నప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాడు కోటగిరి కుటుంబానికి అనుకూలంగా పరిస్థితులు లేవు. అప్పుడు ప్రజల కోరిక మేరకు అనిత స్వయంగా సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి స్వగ్రామంలో కోటగిరి పట్టు నిలిపారు. అయితే ఈ ఎన్నికల్లో అనిత పోటీలో ఉండగానే విద్యాధరరావు ఆకస్మికంగా మృతి చెందారు. ఆ తర్వాత గత ఎన్నికలకు ముందు వీరిద్దరు వైసీపీలోనే ఉండడంతో పాటు శ్రీధర్ గెలుపు కోసం అనిత ప్రచారం కూడా చేశారు. ఆ తర్వాత వీరి మధ్య చిన్న చిన్నగా ఏర్పడిన మనస్పర్థలు క్రమంగా పెరిగినట్టు టాక్ ?ఇప్పుడు కూడా ఈస్టు యడవల్లి పంచాయతీని జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ నుంచి వైసీపీ తరపున కోటగిరి శ్రీధర్ చిన్నాన్న కుమారుడు కోటగిరి కిషోర్ ( కామవరపుకోట సొసైటీ అధ్యక్షులు ) కుమారుడు సాయిని సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టారు. సాయి గెలుపుకోసం ఎంపీ స్థాయిలో ఉండి మరీ కోటగిరి శ్రీధర్ వ్యూహాలు పన్నడంతో పాటు స్థానికంగా ప్రచారం కూడా చేస్తున్నారు. సాయి ఎంపిక అనితకు తెలియకుండా జరగడంతో ఆమె హుటాహుటీన హైదరాబాద్ నుంచి యడవల్లి వచ్చి ఏకాభిప్రాయం లేకుండా సర్పంచ్ అభ్యర్థిని ఎలా ? ఎంపిక చేస్తారని అగ్గిమీద గుగ్గిలం కావడంతో పాటు? ఆమె కూడా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కోటగిరి కుమార్తెగా అనితకు వీరి స్వగ్రాలో మంచి పేరు ఉంది. పార్టీలకు అతీతంగా ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆమె సాయం చేస్తారు. అయితే కోటగిరి శ్రీధర్ వర్గం వెర్షన్ మరోలా ఉంది. ఇప్పటికే ఈ కుటుంబం నుంచి తా,క ఎంపీగా ఉండగా.. వీరి చిన్నాన్న కుమారుడు కిషోర్ సొసైటీ అధ్యక్షులుగా ఉన్నారు. ఇప్పుడు సాయి పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేస్తున్నారు. ఇక అనితకు స్థానికంగా పొలిటికల్‌గా స్పేస్ ఇవ్వలేదు. ఇది ఆమెకు నచ్చకపోవడంతో ఆమె సర్పంచ్ రేసులో ఉండడంతో పాటు తన సోదరుడితోనే తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. ఆమె సర్పంచ్‌గా ఉన్న సమయంలో నాడు టీడీపీ నేతలు కూడా ఆమెకు ప్రయార్టీ ఇవ్వడంతో పాటు ఎమ్మెల్సీ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే ఆ తర్వాత ఆమెకు ఎలాంటి పదవులు లేకపోవడంతో గత ఎన్నికలకు ముందే వైసీపీలో చేరి కుటుంబంలో ఐక్యత చాటారు. అయితే అనంతర కాలంలోనే ఆమెకు ప్రాధాన్యత లేకపోవడంతో ఆమె సైతం తన సత్తా చాటేందుకు రెడీ అవుతున్నారు. కోటగిరి శ్రీధర్ వర్గం తమ అభ్యర్థని ప్రకటించడంతో హైదరాబాద్ నుంచి వచ్చిన అనిత తన వర్గంతో గ్రామంలోనే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం జరుగుతున్నప్పుడు కూడా ఎంపీ కోటగిరి శ్రీధర్ తన స్వగ్రామంలోనే ఇంట్లో ఉండి ఆరా తీసినట్టు చర్చ నడుస్తోంది. ఇప్పుడు అధికార పార్టీ ఎంపీ ఇంట్లో జరుగుతోన్న ఈ వార్ జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది. కోటగిరి ఫ్యామిలీ అంటేనే రాజకీయాలకు పెట్టింది పేరు. అలాంటి కుటుంబంలో అన్న, చెల్లి మధ్యే విబేధాలు వచ్చాయన్న ప్రచారంతో వీరి మధ్య రాజీ చేసేందుకు సమీప బంధువులు ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. విచిత్రం ఏంటంటే అటు అన్నకు, ఇటు చెల్లికి ఇద్దరికి రాజకీయంగాను, వ్యక్తిగతంగాను క్లీన్ ఇమేజ్ ఉంది. అదే సమయంలో ఇద్దరూ పంతానికి పోతే తాము అనుకున్నది సాధించే వరకు వదలరన్న టాక్ కూడా ఉంది. అందుకే కోటగిరి శ్రీధర్ ఎంపీగా ఉండి కూడా తన స్వగ్రామంలో సర్పంచ్ ఎన్నికను అంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అర్థమవుతోంది. మరి ఈ వీరి మధ్య రాజీ కుదురుతుందా ? లేదా ? ఇద్దరు రణక్షేత్రంలో దూకుతారా ? ఎవరిది పై చేయి అవుతుందన్నది కాలమే నిర్ణయించాలి.

## చేదోడు దరఖాస్తులకు .. సవాలక్ష సమస్యలు

విజయవాడ, ఫిబ్రవరి 3, ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రపు గడువునూ ఇవ్వడంతో లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. మూడో విడత చేదోడు పథకంలో లబ్దిదారలులు ప్రభుత్వ సాయం పొందేందుకు దరఖాస్తు చేయడానికి మూడే రోజుల గడువు మాత్రమే కేటాయించారు. పాత లబ్ధిదారుల నుంచి వేలిముద్రల సేకరణ కూడా ఇదే సమయంలో పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దరఖాస్తుల పరిశీలనకు గ్రామ, వార్డు సచివాలయాలకు శుక్రవారం మధ్యాహ్నం వరకూ గడువిచ్చారు. గత రెండు విడతల్లో ఈ ప్రక్రియ పూర్తికి వారం నుంచి 10 రోజుల సమయం ఇచ్చే వారు. గతంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయాన్ని అందుకున్న పాత లబ్ధిదారులు, కొత్త దరఖాస్తుదారులకు కలిపి దాదాపు 80వేల మంది ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంది. నిర్ణీత గడువులోగా గ్రామ, వార్డు సచివాలయాలకు అన్ని పత్రాలతో దరఖాస్తులు అందకపోవడంతో, లబ్దిదారులు, కొత్త దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. దీంతో దరఖాస్తుకు గడువు పొడిగించాలని కోరుతున్నారు. చేదోడు పథకం కింద దర్జీలు, నాయీ బ్రాహ్మణులు, రజకులకు రూ.10వేల చొప్పున ఏటా ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. గత ఏడాది ఫిబ్రవరిలో రెండో విడతలో 2.85 లక్షల మందికి సాయం అందించారు. మూడో విడత సాయాన్ని ఈ నెల 30న లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. పాత లబ్ధిదారులు, కొత్తగా దరఖాస్తు చేసిన వారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, లేబర్ సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంది. మూడు రోజుల వ్యవధిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా కార్యాలయాలకు సెలవు ఇచ్చారు. రెండు రోజుల్లో ధృవీకరణ పత్రాలను ఎలా పొందాలని లబ్దిదారులు ప్రశ్నిస్తున్నారు. కొత్తగా చేదోడు పథకానికి దరఖాస్తు చేసుకునే అర్హులైన వారు ప్రభుత్వం అందించే లబ్ధిని కోల్పోయే అవకాశాలున్నాయని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. మీసేవాకేంద్రాల నుంచి తీసుకున్న ధృవీకరణ పత్రాలు ప్రస్తుత పథకానికి వర్తించబోవని లబ్దిదారులకు గ్రామ, వార్డు సచివాలయ అధికారులు చెబుతున్నారు. పాత లబ్ధిదారులు, కొత్త దరఖాస్తుదారులు కలిపి 2.92 లక్షలమంది వారిలో 1.79 లక్షల మంది దరఖాస్తులు సచివాలయాల స్థాయిలోనే పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు.

## మంగళగిరి వైసీపీలో ముసలం.....



గుంటూరు, ఫిబ్రవరి 3, ఏపీలో వైసీపీ గత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా గెలవడం ఓ ఎత్తైతే మంగళగిరిలో ఆ పార్టీ గెలుపు అనూహ్యంగా నిలిచింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నివసిస్తున్న నియోజక వర్గం నుంచి ఆయన తనయుడు లోకేష్ పోటీ చేశాడు. నాటి ఎన్నికల్లో మంగళగిరిలో లోకేష్ ఓటమి పాలయ్యాడు. ఆర్కే విజయం సాధించాడు. ఆర్కే గెలుపుకు చాలా కారణాలు దోహదం చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా జగన్ ప్రభంజనంలో లోకేష్‌ను ఓడించి ఆర్కే కూడా సునాయాసంగా విజయం సాధించాడు. అలాంటి నియోజక వర్గంలో ఇప్పుడు ఎమ్మెల్యేకు ఎదురు గాలి వీస్తోంది. మంగళగిరి వైఎస్సార్సీపీలో ముసలం పుట్టినట్టుంది. అధికార పార్టీ ఎమ్మెల్యే పనితీరుపై నియోజక వర్గ నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. మరోవైపు మంగళగిరి వైసీపీ సమన్వయకర్తగా ఎమ్మెల్యే ఆర్కే సోదరుడు ఎంపీ అయోధ్య రామిరెడ్డి ఉండటం కూడా నేతల్ని నిరాశకు గురి చేస్తోంది. తామేం చెప్పినా పరిస్థితులు మారే పరిస్థితి లేదనే భావనతో చాలామంది నాయకులు సమీక్షకు డుమ్మా కొట్టేయడం చర్చనీయాంశంగా మారింది. వైకాపా మంగళగిరి నియోజకవర్గ కార్యకర్తల సమీక్ష సమావేశం ఆదివారం మంగళగిరిలో నిర్వహించారు. అయితే సమీక్షకు పలువురు కీలక నాయకులు గైర్హాజరయ్యారు. వచ్చిన కొద్ది మంది నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎమ్మెల్యే పనితీరుపై అభిప్రాయాలను సేకరించే నాయకుల్లో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సోదరుడు, ఎంపీ అయోధ్యరామిరెడ్డి ఉండటంతో శాసనసభ్యుడి పనితీరుపై తమ అభిప్రాయాలు, అసంతృప్తిని వ్యక్తం చేయలేకపోయామని నాయకులు, కార్యకర్తలు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తపరిచారు. పార్టీ కీలక సమావేశంలో అయోధ్యరామిరెడ్డి నాలుగు గోడల మధ్యకు పిలిచి అభిప్రాయ సేకరణ చేయడంతో తమ ఇబ్బందులను, పార్టీలో జరుగుతున్న అన్యాయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లలేక పోయామని కార్యకర్తలు చెబుతు?నారు. బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉంటే తమ సమస్యలన్నింటినీ ఏకరవు పెట్టడానికి అవకాశం ఉండేదంటున్నారు. మూడున్నరేళ్లుగా తమను ఎవరూ పట్టించుకోలేదని, పార్టీలో కూడా తగిన గౌరవం లభించలేదని మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా తమను ఎవరూ లెక్కచేయడం లేదని, నియోజక వర్గంలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత దక్కడం లేదని మరికొందరు నేతలు ఆరోపించారు. సమన్వయ సమావేశానికి పార్టీకి చెందిన కీలక నాయకులు తాడేపల్లి మాజీ ఎంపీపీ దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి మాజీ ఎంపీపీ మున్నంగి గోపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ ఛైర్మన్ చిల్లపల్లి మోహనరావు, తాజా మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు వచ్చి ప్రసంగించి సమావేశం మధ్యలోనే వేరే పని ఉందంటూ వెళ్లిపోయారు. ఎమ్మెల్యే పట్ల అసంతృప్తితో ఉన్న నాయకులు సమీక్షకు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. ఆర్కే పనితీరుతో విసుగు చెందే చాలా మంది గైర్హాజరైనట్లు నాయకుల్లో ప్రచారం సాగుతోంది.

# ఏపీలో లోకల్ ఫ్లయిట్స్

కర్నూలు, ఫిబ్రవరి 3,ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విమాన ప్రయాణం ఇక చాలా సులభతరం కాబోతుంది. లోకల్ బస్సుల మాదిరిగా ఇకపై లోకల్ విమానాలు సందడి చేయనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే విశాఖపట్నం, గన్నవరం, రేణిగుంట, కడప, రాజమండ్రిలో విమానాశ్రయాలు ఉండగా.. తాజాగా, కర్నూలులో కూడా ఎయిర్‌పోర్ట్ రెడీ అయిపోయింది. దీంతో ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ప్రయాణికుల జర్నీ మరింత సులభతరం కానుంది. ముఖ్యంగా విశాఖపట్నం విమానాశ్రయానికి డిమాండ్ పెరుగుతోంది. వచ్చే వేసవిలో సేవలను విస్తరించేందుకు వివిధ విమాన సంస్థల నుంచి 80 వరకు ప్రతిపాదనలు వచ్చాయి. ఇవన్నీ ప్రస్తుతం పౌరవిమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) పరిశీలనలో ఉన్నాయి. విశాఖ విమానాశ్రయం ప్రస్తుతం పూర్తిగా నేవీ ఆధీనంలోనే ఉండటంతో వారిచ్చిన ఖాళీ సమయాల్లోనే ఈ విమానాల్ని నడపాలి. ఇది వరకే ఈ ప్రతిపాదనలపై నేవీ ఉన్నతాధికారులతో చర్చలు నడిచాయి. ఖాళీ స్లాట్ల ఆధారంగా అనువైన సమయాలను డీజీసీఏకు విమానాశ్రయ డైరెక్టర్ రాజకిశోర్ నివేదించారు. దాదాపు ప్రతిపాదనలన్నీ విశాఖ నుంచి నడిపేందుకు యోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలో దీనిపై డీజీసీఏ తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని రాజకిశోర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ విమానాలపై ఇంకా నిషేధం కొనసాగుతోంది. ఎప్పటి నుంచి ఆ విమానాలు మొదలవుతాయనే అంశంపై స్పష్టత లేదు. దీంతో ఇప్పుడొచ్చిన వేసవి ప్రతిపాదనలన్నీ కేవలం దేశీయంగా నడిపేందుకే. ఇక, విశాఖపట్నం నుంచి నూతనంగా కర్నూలు (ఓర్వకల్లు), నాగ్‌పూర్‌కు రోజువారీ సర్వీసులు నడిపేందుకు ఇండిగో సంస్థ ప్రతిపాదించింది. 'ఉడాన్' పథకంలో భాగంగా తక్కువ టికెట్ ధరలతో కర్నూలుకు నడిపే విమానాన్ని ఇది వరకే ఇండిగో ప్రకటించింది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం.. విశాఖపట్నం నుంచి కర్నూలుకు కేవలం 57 నిమిషాలు మాత్రమే జర్నీ. ఈ సమయాల్ని అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. దీన్ని బట్టి చూస్తే కేవలం గంటలోనే ఆంధ్రప్రదేశ్ మొత్తం చుట్టేయొచ్చు. అలాగే విశాఖ- రాజమండ్రి విమాన సర్వీసును మార్చి 28 నుంచి సంస్థ పునరుద్ధరించనుంది. బట్టి చూస్తే రాబోయే రోజుల్లో విమాన ప్రయాణం ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రానుంది.

## రైతుల కోసమే వైఎస్ఆర్సిపి ప్రభుత్వం

బేతంచర్ల, రైతుల కోసమే వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా బేతంచర్ల మండల పరిధిలోని అంబాపురం గ్రామంలోని 35 మంది రైతులకు పట్టలను ఆర్థిక శాఖ మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ముందుగా మద్దిలేటి స్వామి ఆర్చి నుండి అంబాపురం గ్రామానికి 2.5 కిలోమీటర్ల మేర 95.50 లక్షలతో వేసిన తా రోడ్డును ప్రారంభించారు. అనంతరం మద్దిలే స్వామి వస్తానుండి అంబాపురం గ్రామానికి కాలినడకన పాదయాత్ర చేసి ఆర్థిక మంత్రి గ్రామానికి చేరుకున్నాడు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల కోసం మౌనిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రైతులకు భరోసానిస్తూ రైతు భరోసాను ప్రవేశపెట్టిందని పంట వేసిన రైతులకు నష్టపోకుండా పంట బీమా సౌకర్యాన్ని కల్పించి రైతులను ఆదుకుంటుందని ప్రతి గ్రామానికి శాశ్వత రోడ్డు నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నామని గ్రామాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి దేనిని ఆయన కొనియాడారు.

# విశాఖ టీడీపీ చుక్కాని లేని నావా...

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, తెలుగుదేశం పార్టీకి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పెద్ద దిక్కుగా దివంగత నేత మాజీ ఎంపీ ఎంవీవీస్ మూర్తి ఉండేవారు. ఆయన 2018 అక్టోబర్ 2న అమెరికాలో ఒక రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలు అయ్యారు. ఎన్టీయార్ పిలుపు అందుకుని 1982లో టీడీపీలో చేరిన పారిశ్రామికవేత్త మూర్తి కడదాకా అదే అంకిత భావాన్ని పార్టీ పట్ల చూపించారు. ప్రత్యేకించి ఆయన చంద్రబాబుకు ఆంతరంగికుడు. ఉత్తరాంధ్రాలోని మూడు జిల్లాల్లో చీమ చిటుక్కుమన్నా కూడా బాబుకు ఆయనే చేరవేసేవారు. ఇక టీడీపీకి ఎంత మంది నాయకులు ఉన్నా, ఎంత పెద్ద పదవుల్లో వారు ఉన్నా కూడా మూర్తి మాటే ఫైనల్. ఆయన కనుసన్నలలోనే పార్టీ నడిచేది. చంద్రబాబు అందరితో మాట్లాడినా కూడా మూర్తితో చివరలో మాట్లాడి ఒక నిర్ణయానికి వచ్చేవారు. ఇక పార్టీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే అధినాయకత్వం దృష్టికి తీసుకువచ్చి సరిచేసే మెకానిజంగా కూడా మూర్తి ఉండేవారు. దాంతో మూడు జిల్లాల్లో టీడీపీ కంచుకోటగా మారడానికి మూర్తి లాంటి వారి పాత్ర చాలానే ఉంది అంతా ఒప్పుకుంటారు. బేసికల్ గా పారిశ్రామికవేత్త అయిన మూర్తి టీడీపీకి వెన్నుదన్నుగా ఉండేవారు. పార్టీని ఆర్ధికంగా ఆయన ఆదుకునేవారు. అర్బన్ జిల్లాలోని పార్టీ ఆఫీస్ ని ఆయన ఒంటి చేత్తో నడిపించారు అంటారు. ఆయన మరణించాక పార్టీ ఆఫీస్ నిర్వహణ భారం ఏంటో తమ్ముళ్ళకు ఒక్కసారిగా తెలిసివచ్చింది. ఇక ఎన్నికల వేళ పార్టీకి అర్ధ అంగబలాన్ని కూడా మూర్తి సమకూర్చిపెట్టేవారని చెబుతారు. ఆయన రాజకీయ వ్యూహాలతో పాటు, పార్టీని ఏకతాటిపైకి నడిపించే తీరు కూడా ఎన్నో విజయాలకు కారణం అయ్యాయని పేర్కొంటారు. ఇక ఎపుడైతే మూర్తి కనుమరుగు అయ్యారో నాటి నుంచి విశాఖ సిటీలో టీడీపీ ఒక విధంగా అనాధ అయిందని అంటున్నారు. పార్టీ కార్యాలయం కూడా కళకళలాడడంలేదు అన్న వారూ ఉన్నారు. ఇక పార్టీకి కొండంత అండగా నిలిచే మూర్తి ప్లేస్ ని భర్తీ చేయడం కష్టమన్న మాట కూడా తమ్ముళ్ళ నుంచి వినిపిస్తోంది. ఇపుడు పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సీన్ ఉంది. ఇక అధినేత చంద్రబాబుకు కూడా మూడు జిల్లాల పార్టీ తీరు గురించి కచ్చితమైన సమాచారం కూడా చేరడంలేదు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఉత్తరాంధ్రాలో సైకిల్ రిపేరు కి వచ్చిందని విశ్లేషిస్తున్నారు. మళ్ళీ పెద్దాయన పాత్రలోకి ఎవరైనా వస్తేనే తప్ప పసుపు పార్టీ పటిష్టం కావడం కష్టమేనని తేల్చేస్తున్నారు.

# ఆటపాటల్లో ఉత్సాహం

గుంటూరు, ఫిబ్రవరి 3, (బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో విశ్వనాథ్ జన్మించారు. ఈ గ్రామంలోనే పది సంవత్సరాల వయస్సు వరకు ఉన్నారు. తర్వాత విజయవాడకు షిఫ్ట్ అయ్యారని గ్రామస్థులు చెబుతున్నారు. చిన్నతనంలో విశ్వనాథ్ చాలా చలాకీగా ఉండేవారని, ఆటపాటల్లో ముందుండే వారని ఆయన స్నేహితుడు తెలిపారు. వారి కుటుబానికి గ్రామంలో పెద్ద వ్యవసాయ భూములు ఉండేవని.. సినిమాల్లో స్థిరపడి మద్రాస్ షిఫ్టు అయిన తర్వాత గ్రామంలో ఉన్న స్థలాన్ని తనకు విక్రయించారని గ్రామస్థుడు బసవపున్నయ్య వివరించారు. ఆ ఇంటిని కొన్న నాటి నుంచి గతంలో తనకి ఉన్న ఇబ్బందులు తొలిగాయని, ఉద్యోగం కూడా వచ్చి జీవితంలో స్థిరపడ్డానని అంటున్నారు. ఎలాంటి కల్మషం లేని మంచి వ్యక్తి విశ్వనాథ్ అని చెబుతూ.. ఆయన ఆశీస్సులతోనే తన కుటుబానికి మంచి జరిగిందని వెల్లడిస్తున్నారు.

విశ్వనాథ్ లేరన్న వార్త కంటతడి పెట్టిస్తోంది..!

బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం బట్టిప్రోలు మండలం పెద్దపులి వారు గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో విశ్వనాథ్ జన్మించారు. ఆయన ఐదో తరగతి వరకు ఇక్కడే చదువుకుని తర్వాత విజయవాడ వెళ్లారు. సజ్జ బసవపున్నయ్య.. గ్రామంలో ఉన్న విశ్వనాథ్ ఇల్లు కొనుక్కున్నారు. విశ్వనాథ్ ఇంటి ముందు చిన్న కిల్లి కొట్టు పెట్టుకుని బతికేవాళ్లమన్నారు. అప్పుడు అక్కడే విశ్వనాథ్ కు చిన్న పెంకుటిల్లు ఉండేదన్నారు. ఆ ఇల్లు కొన్న తర్వాత తనకు బాగా కలిసి వచ్చిందని బసవపున్నయ్య చెప్పారు. విశ్వనాథ్ పొలాలు

## విశ్వనాథ్ తో సన్నిహితాన్ని గుర్తు చేసుకున్న స్నేహితులు

కూడా వాళ్ల తాతలు పండించే వారిని వివరించారు. విశ్వనాథ్ లేరన్న వార్త తమను కలచివేస్తోందని కంటతడి పెట్టుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి..!ఆయనతోపాటు ఐదో తరగతి వరకు చదువుకున్న వెంకట సుబ్బారావు ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పదో సంవత్సరం వచ్చేదాకా ఇక్కడే ఉన్నారని చెప్పుకొచ్చారు. తర్వాత విజయవాడలో వాళ్ల తండ్రి సిమిమా థియేటర్ లో మేనేజర్ గా పనిచేసే వారని గుర్తు చేశారు. తర్వాత వాళ్ల కుటుంబం విజయవాడ వెళ్లిపోయారని, విశ్వనాథ్ కూడా అక్కడే చదువు కొనసాగించాడని చెప్పుకొచ్చారు. తర్వాత విశ్వనాథ్ తండ్రి బి.యన్ రెడ్డితో పరిచయం ఏర్పడడంతో సినిమా ఫీల్డ్ కి పంపించారన్నారు. బంధుత్వం లేకపోయినా ఏరా అన్నయ్య అంటే ఏరా తమ్ముడు అని ఆప్యాయంగా పలకరించే వారని ఆనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. కళాతపస్వి చనిపోయారన్న వార్త తమను ఎంతగానో బాధించిందని చెబుతున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ దర్శకులు, కళాతపస్వి కె. విశ్వనాథ్ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం కె. విశ్వనాథ్ వయసు 92 ఏళ్ళు. కొన్ని రోజులుగా వయసు రీత్యా వచ్చిన అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. హెల్త్ ఇష్యూస్ సీరియస్ కావడంతో నగరంలోని ప్రముఖ ఆసుపత్రిలో మరణించారు. సినిమాల్లో విశ్వనాథ్ కెరీర్ సౌండ్ రికార్డిస్ట్ గా మొదలైంది. వాహిని స్టూడియోస్ లో ఆయన తొలి ఉద్యోగం అదే. ఆ తర్వాత దర్శకత్వం వైపు అడుగులు వేశారు. మన సినిమా పరిశ్రమ ఎప్పటికీ గర్వంగా చెప్పుకొనే సినిమాల్లో ఒకటైన 'పాతాళ భైరవి' చిత్రానికి ఆయన దర్శకత్వ శాఖలో పని చేశారు.

తొలి సినిమాకు నంది 'ఆత్మ గౌరవం' సినిమాతో విశ్వనాథ్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. దానికి నంది పురస్కారాల్లో ఉత్తమ సినిమా విభాగంలో కాంస్య బహుమతి లభించింది. కథకు కూడా నంది పురస్కారం లభించింది. ఆ తర్వాత విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 'చెల్లెలి కాపురం', 'శారదా', 'ఓ సీత కథ', 'జీవన జ్యోతి' చిత్రాలు ఉత్తమ సినిమా విభాగంలో నందులు అందుకున్నాయి. నందులు అందుకున్న సినిమాలు ఇంకెన్నో ఉన్నాయి.

# ఏపీలో విస్తరణకు బీఆర్ఎస్ ప్రణాళిక




విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, ఏపీలో విస్తరణకు బీఆర్ఎస్ పార్టీ భారీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఏపీలో విద్యా సంస్థల అధినేతలు, ఉద్యమ నేతలను బీఆర్ఎస్ టార్గెట్ చేసింది. విశాఖలో జరిగే కేసీఆర్ సభలో కీలక నేతలను పార్టీలో చేర్చుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ విశాఖలో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ జేడీ లక్ష్మీ నారాయణతో భేటీ అయ్యారు. వారితో బీఆర్ఎస్ లో చేరేందుకు మంతనాలు జరిపినట్లు సమాచారం. మరికొంత మంది ఉత్తరాంధ్ర నేతలతో ఎమ్మెల్యే వివేక్ భేటీ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తోట చంద్రశేఖర్‌ను ఏపీ బీఆర్ఎస్ కు అధ్యక్షుడిగా కేసీఆర్ నియమించారు. దీంతో కాపుల్ని బీఆర్ఎస్ కు దగ్గరకు చేసేందుకు ప్లాన్ వేసింది. అలాగే కాపుల్లో గంటా శ్రీనివాస్ కు ఉన్న పాపులారిటీని ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో విశాఖలో సభ పెట్టి వాళ్లను పార్టీలో చేర్చుకునే దిశగా చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ గంటా, మాజీ జేడీ లక్ష్మీనారాయణతో రహస్యంగా భేటీ అయినట్లు సమాచారం. అలాగే ఉత్తరాంధ్రకు చెందిన కొందరు ఎమ్మెల్యేలతో వివేక్ మంతనాలు జరుగుతున్నాయి. తోట చంద్రశేఖర్ ను బీఆర్ఎస్ లోకి ఆహ్వానించినప్పుడు సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ లోకి సిట్టింగ్ ఎమ్మెల్యేలు వస్తారంటూ సీఎం కేసీఆర్ అన్నారు. కేసీఆర్ అంటున్నట్లుగా బీఆర్ఎస్ లోకి వెళ్లే జంప్ జిలానీలు ఎవనేదారి పై అంచనాలు వేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు సైతం భారతీయ రాష్ట్ర సమితిలోకి రావటానికి సిద్దంగా ఉన్నారని కేసీఆర్ బీఆర్ఎస్‌లో నేతల చేరిక సందర్భంగా వ్యాఖ్యానించారు. వైసీపీ,టీడీపీ పార్టీలకు పక్కాగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు వర్తిస్తాయి. ఎందుకంటే ఈ రెండు పార్టీలకు చెందిన శాసనసభ్యులే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ శాసన సభలో ఉన్నారు. వైసీపీ, టీడీపీ ఎమ్మెల్యేల్లో ఎవరు భారతీయ రాష్ట్ర సమితికి జై కొడతారు అనేది కీలకంగా మారింది. దీంతో రెండు పార్టీలకు చెందిన శాసన సభ్యులపై అంచనాలు కూడా మొదలయ్యాయి. ఏపీలో ఉన్న కీలకమైన రాజకీయ పార్టీలను కాదని, తెలంగాణ సెంటిమెంట్ ను కేంద్రంగా చేసుకొని ఏర్పాటైన టీఆర్ఎస్ పార్టీ ఆ తరువాత భారతీయ రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందిన పార్టీలో చేరుతారా అన్నది ప్రధాన సందేహం. ప్రజారాజ్యం, వైసీపీ, జనసేనల్లో పోటీ చేసి ఓడిపోయిన తోట చంద్రశేఖర్ తో పాటుగా, ఏపీకి చెందిన మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు సహా పలు పార్టీల్లో పనిచేసి సైలెంట్ అయిన కొందరు ద్వితీయ శ్రేణి నేతలు కేసీఆర్ సమక్షంలోనే బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. గంటా, లక్ష్మీనారాయణతో బీఆర్ఎస్ నేతలు మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో ఏపీలో బీఆర్ఎస్ చేరికలపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో కీలక నేతలు బీఆర్ఎస్ లో చేరుతున్నారు. ఇటీవల ఒడిశా మాజీ సీఎం బీఆర్ఎస్ లో చేరారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ కు చెందిన కీలక నేతలు పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు.

# ఆ నియోజకవర్గాల్లో నిత్యం రచ్చ..రచ్చే

విజయవాడ, ఫిబ్రవరి 3, అధికార పార్టీ వైసీపీకి అవసరానికి మించిన ఎమ్మెల్యేల బలం ఉంది. మొత్తం 151 మంది ఎమ్మెల్యేలు గత ఎన్నికల్లో విజయం సాధించారు. అయినప్పటికీ ప్రతిపక్షపార్టీ టీడీపీని బలహీన పరిచే ఉద్దేశంతో ఆ పార్టీలో నెగ్గిన ఎమ్మెల్యేలను వైసీపీలోకి ఆహ్వానించారు. ఇది ఇప్పుడు టీడీపీకి ఇబ్బందిగా లేకపోయినా వైసీపీలో మాత్రం నిప్పులు చెరిగే పరిస్థితిని తీసుకువచ్చింది. ప్రకాశం జిల్లా చీరాల, కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితి నిత్యం రగడలతో సతమతమవుతోంది. కేవలం అప్పటికప్పుడు పుట్టిన విభేదాలే అయితే అవి చల్లారిపోయేవి. కానీ, ఎన్నికలకు ముందు నుంచి ఉన్న విభేదాలు కావడం నాయకులను తీసుకుకోవడం కలిసి పనిచేయాలని ఆదేశించడం వంటి పరిణామాలు వైసీపీలో తీవ్ర వివాదానికి కారణంగా మారాయి. చీరాలలో ఆమంచి కృష్ణమోహన్, కరణం బలరాం వర్గాల మధ్య మాటల తూటాలు పేలుతూనే ఉన్నాయి. సందర్భం వస్తే పరోక్ష వ్యాఖ్యలతో నాయకులు వేడి పుట్టిస్తున్నారు. వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమంలో రెండు వర్గాలు బాహా బాహీకి దిగడం పార్టీ వర్గాలను కలవర పర్చింది. ఇక, కరణం పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కూడా రాత్రి వేళలో నిర్వహించిన ర్యాలీ కూడా కరణం.. ఆమంచి వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. మత్స్యకారుల మధ్య వివాదాలను కూడా ఈ ఇద్దరు రాజకీయంగా వాడుకుని రోడ్డెక్కారు. ఈ పరిణామాలు గమనించిన వారు రెండు వర్గాలు కలిసి పనిచేసే పరిస్థితి లేదని అంటున్నారు. చీరాలలో సొంత కేడర్ ఉండటంతో ఆమంచి స్ట్రాంగ్‌గా ఉన్నారు. బలరాంకు అద్దంకి కూడా ఆప్షన్ ఉంది. దీంతో ఈ పంచాయితీని ఎలా కొలిక్కి తెస్తారన్నది పెద్దగా ప్రశ్నగా మారిపోయింది. గన్నవరం విషయానికి వస్తే.. మరింతగా ఈ నియోజకవర్గం రగులుతోంది. నిత్యం ఎంతో ప్రశాంతంగా ఉండే గన్నవరంలో టీడీపీ తరఫున గెలిచిన వంశీని వైసీపీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే వంశీకి, వైసీపీ నేత దుట్టా రామచంద్రరావుకు మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గు మంటోంది. అలాగే వంశీపై 2014 ఎన్నికల్లో ఓడిపోయిన యార్లగడ్డ వెంకట్రావుకు పడడం లేదు. ఇటీవల పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో కనీసం గ్రామాల్లోకి కూడా వంశీని రాకుండా యార్లగడ్డ అనుచరులు అడ్డుకున్నారు. పార్టీ పెద్దలు ఏదో ఆశిస్తే.. క్షేత్రస్థాయిలో మాత్రం మూడు వర్గాలు తయారయ్యాయి. అధిష్ఠానం ఆశీస్సులు ఉండటంతో వంశీ దూకుడుగా ఉన్నారు. కానీ, అదే రేంజ్‌లో ఒకవైపు యార్లగడ్డ.. మరోవైపు దుట్టాలు సవాళ్లు ప్రతిసవాళ్లతో గన్నవరం రాజకీయాలను వేడెక్కిస్తున్నారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో వైసీపీ పుంజుకోవడం కష్టమనే వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

# లోకేష్ పాదయాత్రకోసం పూజలు

నర్సాపురం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగలం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం టిడిపి నాయకులు పొత్తూరు రామరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని లాగ వద్ద వేంచేసి ఉన్న వీరభవాన్ని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి గరగాలతో ఊరేగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్లో క్రిమినల్ పరిపాలన ప్రారంభమైందని చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక క్రిమినల్ కేస్ కూడా లేదని చంద్రబాబు నాయుడు ఎంతో మంచి పరిపాలన చేశారని జగన్ ప్రభుత్వాన్ని పారద్రోలాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ రోజున నారా లోకేష్ పాదయాత్ర కు అమ్మవారి ఆశీస్సులతో యువగళం సక్సెస్ అవ్వాలని పూజలు చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు పద్మ. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శశిదేవి. టిడిపి కౌన్సిలర్ పాలూరి బాబ్జి. కొల్లు పెద్దిరాజు. ఠాగూర్ .జక్కం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వివేక హత్య కేసులో కీలక మలుపు

విజయవాడ, ఫిబ్రవరి 3, వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ అధికారులు కడప సెంట్రల్ జైల్ గెస్ట్ హౌస్‌లో విచారణ ప్రారంభించారు. విచారణకు సీఎం జగన్ ఓఎస్డీగా పని చేస్తున్న కృష్ణమోహన్ రెడ్డి, అలాగే తాడేపల్లిలో సీఎం క్యాంప్ ఆఫీసులో పని చేసే నవీన్ అనే వ్యక్తి హాజరు కానున్నారు. ముందుగా కృష్ణమోహన్ రెడ్డి సీబీఐ ఎదుట హాజరైనట్లుగా తెలుస్తోంది. సెంట్రల్ జైల్ గెస్ట్ హౌస్ లో భారీ భద్రత నడుమ విచారణ జరుగుతోంది. కృష్ణమోహన్ రెడ్డితో పాటు కడప సెంట్రల్ జైల్లో ఇప్పటికే రిమాండ్ లో ఉన్న దేవిరెడ్డి శంకర్ రెడ్డి, యాదాటి సునీల్, ఉమా శంకర్ రెడ్డి లను సిబిఐ విచారించే అవకాశం ఉంది. వైఎస్ వివేకా హత్య జరిగిన రోజు.. ఎంపీ అవినాష్ రెడ్డి కాలే డేటాను సీబీఐ పరిశీలించినట్లుగా తెలుస్తోంది. ఇటీవల అవినాష్ రెడ్డిని సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ఆ తర్వాత విచారణలో వెల్లడైన అంశాలను బట్టి నవీన్ , కృష్ణమోహన్ రెడ్డిలకు నోటీసులను సీబీఐ జారీ చేసింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి ఫోన్లను నవీన్ అటెండ్ చేస్తూంటారని చెబుతున్నారు. గతం నుంచి జగన్ వద్ద పని చేస్తున్న కృష్ణమోహన్ రెడ్డికి వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఓఎస్డీగా నియమించారు. వివేకా హత్య కేసు విచారణను ఇప్పటికే హైదరాబాద్ కోర్టుకు తరలించారు. వైఎస్ వివేకా హత్య కేసు అధికారికంగా సీబీఐ కోర్టుకు బదిలీ అయింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వైఎస్ వివేకా హత్య కేసులో విచారణ ప్రక్రియ సీబీఐ కోర్టు ప్రారంభించింది. వైఎస్ వివేకా హత్య కేసులో ప్రధాన, అనుబంధ ఛార్జ్ షీట్ విచారణకు స్వీకరించింది. వైఎస్ వివేకా హత్య కేసుకు రాఅ/01/2023 నంబరు కేటాయించింది. హత్య కేసులో ఐదుగురు నిందితులకు సమన్లు జారీ చేసింది. ఎర్ర గంగిరెడ్డి, వై.సునీల్ యాదవ్, జి.ఉమాశంకర్ రెడ్డి, షేక్ దస్తగిరి, డి.శివశంకర్ రెడ్డికి ఈ సమన్లు వెళ్లాయి. వీరిలో నలుగురు జైల్లో ఉండగా.. ఒక్క ఎర్ర గంగిరెడ్డి మాత్రం బెయిల్ పై ఉన్నారు. ఆయన బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్ తెలంగాణ హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. ఫిబ్రవరి 10న విచారణకు హాజరు కావాలని నిందితులను ఆదేశించింది. అలాగే నిందితుల్ని కూడా కడప జైలు నుంచి హైదరాబాద్ తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో అరెస్టు చేసిన దేవిరెడ్డి శంకర్ రెడ్డి, గజ్జల ఉమాశంకర్ రెడ్డితో పాటు మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం కడప జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వీరికి కడప జైల్లో ముప్పు పొంచి ఉందని సీబీఐ అనుమానిస్తోంది. ఇదే విషయాన్ని వివేకా కుమార్తె సునీతారెడ్డి కూడా కోర్టుకు చెప్పారు. దీంతో సీబీఐ అధికారులు నిందితుల్ని హైదరాబాద్ లోని చంచల్ గూడ లేదా చర్లపల్లి జైలుకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభించిన మునిసిపల్ ఛైర్ పర్సన్

మదనపల్లె పిల్లల్లో సైన్స్ మరియు టెక్నాలజీ పై ఆసక్తి పెంచేందుకు మరియు వారిలో విజ్ఞానాన్ని నింపేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం చేస్తాయని మున్సిపల్ ఛైర్ పర్సన్ వరపన మనూజ పేర్కొన్నారు. నేడు అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో క్రై మరియు పోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుజాత, కౌన్సిలర్ ఫర్జానాఫీ, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లలితమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మండల స్థాయిలోని 11 ఉన్నత పాఠశాలల నుండి వచ్చిన 112 మంది పిల్లలు వారు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్ట్ తో హాజరు అయి వాటి గురించి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పోర్డ్ సంస్థ పిల్లల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ, వాటిలో భాగంగా ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు చేపట్టి పిల్లల్లో నైపుణ్యం పెంపొందించడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు.

# డిసెంబరు నాటికి ఆటోమేటిక్ లడ్డూ యంత్రాల ఏర్పాటు

## - రోజుకు 6 లక్షల దాకా లడ్డూల తయారీకి అవకాశం
## - ప్రపంచంలోనే టాప్ 1 మ్యూజియంగా తిరుమల మ్యూజియం
## - డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో టీటీడీ ఈఓ శ్రీ ఎవి.ధర్మారెడ్డి

తిరుమల ,ఫిబ్రవరి 03 తిరుమలలో లడ్డూ తయారీ కోసం డిసెంబరు నాటికి రూ 50 కోట్లతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన యంత్రాల వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని టీటీడీ ఈవో శ్రీ ఎవి ధర్మారెడ్డి చెప్పారు. ప్రపంచంలోనే టాప్ 1 స్థాయిలో తిరుమల మ్యూజియం ను డిసెంబరు నాటికి సిద్ధం చేస్తామని ఆయన తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి , ఆతరువాత మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.– జనవరి 28న తిరుమలలో నిర్వహించిన రథసప్తమి ఉత్సవానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. ఉదయం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు భక్తులు సప్తవాహనాలపై శేషాచలాధీశుని వైభవాన్ని తిలకించి తరించారు.– లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు, టి, కాఫీ, పాలు, అల్పాహారాలు అందించాం.– తిరుమలలో నిర్మించిన నూతన పరకామణి భవనంలో ఫిబ్రవరి 5న కానుకల లెక్కింపు ప్రారంభంకానుంది. తిరుమలలో స్వామివారి హుండీ కానుకలు లెక్కించడానికి బెంగళూరుకు చెందిన దాత శ్రీ మురళీకృష్ణ అందించిన రూ.23 కోట్ల విరాళంతో అధునాతన సౌకర్యాలతో కూడిన నూతన పరకామణి భవనం నిర్మించాం.– తిరుమల శ్రీవారి ఆలయ ఆనందనిలయం బంగారు తాపడం పనులను ఆరు నెలల పాటు వాయిదా వేస్తున్నాం. త్వరలో మరో తేదీ నిర్ణయించి తెలియజేస్తాం.– తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో విమానగోపురం బంగారు తాపడం పనులను స్థానిక కాంట్రాక్టరు నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయకపోవడంతో ఆలస్యం అవుతోంది. తిరుమలలో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా నిర్దేశిత వ్యవధిలో ఆనందనిలయం బంగారు తాపడం పనులు పూర్తి చేసేందుకు వీలుగా గ్లోబల్ టెండర్లకు వెళుతున్నాం. ఈ ప్రక్రియకు సమయం పడుతుండడంతో తాపడం పనులను వాయిదా వేశాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా శ్రీవారి ఆలయంలో తాపడం పనులు పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం.– భక్తులకు మరింత మెరుగైన డిజిటల్ సేవలు అందించేందుకు ప్రయోగాత్మకంగా టిటిడిదేవస్థానమ్స్ పేరుతో మొబైల్ యాప్‌ను ఇటీవల ప్రారంభించాం.– తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు, వసతి, అంగప్రదక్షిణ, సర్వదర్శనం, శ్రీవారి సేవ బుక్ చేసుకోవడంతోపాటు విరాళాలు కూడా అందించవచ్చు. పుష్ నోటిఫికేషన్ల ద్వారా తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే ఉత్సవాల వివరాలు ముందుగా తెలుసుకోవచ్చు. ఎస్వీబీసీ ప్రసారాలను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా వీక్షించవచ్చు.– శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌లో సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు ప్రసారమవుతున్న గరుడపురాణం భక్తుల మన్ననలు పొందుతోంది.– యువతకు ధార్మిక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ఫిబ్రవరి 5, 6 తేదీల్లో తిరుమల ఆస్థానమండపంలో యువ ధార్మికోత్సవం నిర్వహిస్తాం. దాదాపు 2 వేల మంది యువతీ యువకులు పాల్గొంటారు.– ఫిబ్రవరి 5న రామకృష్ణతీర్థ ముక్కోటి, మాఘ పౌర్ణమి గరుడ సేవ.– ఫిబ్రవరి 18న గోగర్భ తీర్థంలో క్షేత్రపాలకుడికి మహాశివరాత్రి పర్వదినం.

– ఫిబ్రవరి 11 నుండి 19వ తేదీ వరకు ' శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో.– ఫిబ్రవరి 11 నుండి 20వ తేదీ వరకు ' తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో.– ఫిబ్రవరి 19 నుండి 27వ తేదీ వరకు ' తొండమనాడులోని శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో.– ఫిబ్రవరి 28 నుండి మార్చి 8వ తేదీ వరకు 'తరిగొండలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో.జనవరి నెలలో నమోదైన వివరాలు :దర్శనం : – శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య ' 20.78 లక్షలు.హుండీ : – హుండీ కానుకలు ' రూ.123.07 కోట్లు.లడ్డూలు : – విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య ' 1.07 కోట్లు.అన్నప్రసాదం : – అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య ' 37.38 లక్షలు.కల్యాణకట్ట : – తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య ' 7.51 లక్షలు.

# పాదయాత్రలో బాబాయ్ అబ్బాయి.

## ఆసక్తికరంగా అనంత రాజకీయాలు

అనంతపురం ప్రజా సంక్షేమయాత్ర పేరుతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో చేప ట్టిన పాదయాత్రకు పాదయాత్రకు అడుగడుగునా జన నీరాజనం పట్టారు. అందులో భాగంగా పలు గ్రామాల్లో బాబాయ్ అబ్బాయి పాదయాత్ర చేపట్టారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన రాష్ట్రంలో అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా ముఖ్యమంత్రి రాష్ట్రంలో పారదర్శక పాలన సాగి స్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయ న్నారు. పాదయాత్రలో తాడపత్రి నియోజకవర్గ ఎమ్మెల్యే కేతి రెడ్డి పెద్దారెడ్డి ధర్మవరం నియోజవర్గ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అందరిని ఆప్యాయంగా పలుకరిస్తూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి పట్టం కట్టాలని ప్రజలను కోరారు.

# వివేకా హత్య కేసు..

## సిబీఐ ముందుకు జగన్ ఓఎస్డీ

కడప మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ విచారణ కొనసాగుతోంది. తాజాగా ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి సీబీఐ ఎదుట హాజరయ్యారు. అవినాష్ రెడ్డి ఫోన్ కాల్ డేటా ఆధారంగా గతంలో కృష్ణ మోహన్ రెడ్డితో పాటు వైఎస్ భారతి ఇంట్లో పనిచేసే నవీన్కు సీబీఐ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో కడప కేంద్ర కారాగారంలో సీబీఐ విచారణకు ఈరోజు వీరిద్దరూ హాజరయ్యారు. ఈ నెల 28న కడప ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డిని నాలుగున్నర గంటలపాటు విచారించిన సీబీఐ.. ప్రధానంగా ఆయన కాల్డేటాపై ఆరా తీసింది. నవీన్ అనే వ్యక్తి పేరిట ఉన్న మొబైల్ నంబర్కు అవినాష్ ఎక్కువగా కాల్ చేసి మాట్లాడినట్లు దర్యాప్తులో గుర్తించింది. ఈ నేపథ్యంలో అతనితో పాటు కృష్ణ మోహన్ రెడ్డి సీబీఐ నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎర్రగంగిరెడ్డి, అప్రూవర్గా మారిన డ్రైవర్ దస్తగిరి, రిమాండు ఖైదీలుగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్రెడ్డి, ఉమాశంకర్రెడ్డి, సునీల్యాదవ్లను ఫిబ్రవరి 10న విచారణకు హైదరాబాద్కు రావాలని సీబీఐ నోటీసులిచ్చిన విషయం తెలిసిందే.

# నకిలీ అగ్రిమెంట్ల కేంద్రంగా బద్వేలు



**ఫోర్జరీ సంతకాలతో హక్కుదారునికి తెలియకుండానే ఇంటి స్థలాల అమ్మకాలు**
**పాత తేదీలతో అగ్రిమెంట్ల తయారీఅగ్రిమెంట్ల తయారీలో పలు గ్యాంగులుగ్యాంగుల్లో కొందరు మహిళలు**

బద్వేలు  నకిలీ ఇంటి పట్టాలకు కేంద్రమైన బద్వేలు ఇప్పుడు నకిలీ అగ్రిమెంట్లకు కూడా కేంద్రంగా మారింది ఇంటి పట్టా కలిగిన హక్కుదారునికి ఏ మాత్రం సంబంధం లేకుండానే నకిలీ అగ్రిమెంట్లు సృష్టించి స్థలాలు తమకే అమ్మినట్లు తయారు చేస్తున్నారు ఇందుకు కొన్ని ప్రత్యేకమైన గ్యాంగులు ఉన్నాయి బద్వేల్ లో పదిమంది కలిసి ఒక గ్యాంగ్ గోపవరం మండలంలో మూడు గ్యాంగులు బి కోడూరు మండలంలో నాలుగు గ్యాంగులు అట్లూరు మండలంలో మరో నాలుగు గ్యాంగులు ఉన్నాయి ఇందులో కొందరు మహిళలు కూడా ఉన్నారు ఫోర్జరీ సంతకాలు చేయడంలో వీరుగానపాటీలు అని చెప్పాలి ఎవరి సంతకమైనా ఈ అధికార సంతకమైన ఏమాత్రం అనుమానం రాకుండా చేసేస్తారు ఇటువంటి మహిళలపై ఇప్పటికే పోలీస్ కేసు నమోదయింది తాసిల్దార్ జిల్లా కలెక్టర్ తో పాటు ప్రైవేట్ వ్యక్తుల సంతకాలు కూడా ఏమాత్రం తీసుకోకుండా అచ్చు గుద్దినట్లు చేసేస్తారు వీరు అంతా ఆరితేరిపోయారని చెప్పాలి చెప్పాలి విలువైన ఇంటి స్థలాలపై వీరికి ఎప్పటినుంచో కన్ను ఉంది మీరు వద్ద ఉన్న పాత అగ్రిమెంట్ల ద్వారా స్థలం హక్కుదారుని సంతకం అచ్చుకుద్దినట్లు చేసి తమకు స్థలం హ క్కుదారుడు విక్రయించినట్లు అగ్రిమెంట్లు తయారు చేస్తారు ఈ విషయం స్థలం కలిగిన అక్కుదారునికి ఏ మాత్రం తెలియదు వీరి వద్ద పాత అగ్రిమెంట్లు ఎన్నో ఉన్నాయి ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే పాత తేదీలతో అగ్రిమెంట్లు తయారుచేసి ఇతరులకు లక్షలకు లక్షలకు విక్రయిస్తారు పాత అగ్రిమెంట్లు అసలైనవే నకిలీవ తెలుసుకోవడం అత్యంత కష్టం స్థలం గల హక్కుదారుడు సంతకం కూడా అచ్చు గుద్దినట్లు ఉంటుంది హక్కుదారుని ఇంటి వివరాలు అన్ని ముందుగానే తెలుసుకొని ఆ తరువాత రంగంలోకి దిగి ఎవరు కనుక్కోని విధంగా అగ్రిమెంట్లు తయారుచేస్తారు ఇవి బద్వేల్ లో ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నాయి బద్వేలు పట్టణం సిద్ధవటం రోడ్డులో పూర్వపు చెన్నంపల్లి పంచాయతీ 1790/3 సర్వే నెంబర్లో హ క్కుదారునికి సంబంధం లేకుండానే ఇంటి స్థలంపై నకిలీ అగ్రిమెంట్ సృష్టించి ఇతరులకు విక్రయించారు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కంప సముద్రం గ్రామాన్ని చెందిన ఒక మహిళ బద్వేల్ లో కొంతమంది దళారులను పట్టుకుని వారి ద్వారా స్థలం అమ్మకం చేసినట్లు సమాచారం బ్రోకర్లు తమ బ్రోకరేజ్ చూస్తున్నారు తప్ప అసలు హక్కుదారుడు స్థలాన్ని విక్రయించాడా అగ్రిమెంట్ అసలుదా? నకిలీదా?స్థలం హక్కుదారుడు స్థలాన్ని విక్రయించాడా? అనే విషయాలు ఏమాత్రం పట్టించుకోకుండా స్థల విక్రయాలు జరిగిపోతున్నాయి ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు హక్కుదారుడు అనుభవించాల తప్ప ఇతరులకు విక్రయించకూడదని బద్వేల్ ఆర్ డి ఓ ఆకుల వెంకటరమణ పదేపదే చెబుతూ వస్తున్నారు వంద రూపాయల బాండ్ పేపర్ పై స్థల విక్రయాలు జరిగినా అవి ఏమాత్రం చెల్లవని అవి చిత్తు కాగితంతో సమానమని ఆర్డిఓ ఇప్పటికే  పలుమార్లు చెప్పడం జరిగింది హక్కుదారునికి ఏమాత్రం సంబంధంలేని నకిలీ అగ్రిమెంట్లు ఇప్పుడు బద్వేల్ను కుదిపేస్తున్నాయి ఇప్పటికే నకిలీ ఇంటి పట్టాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు ఇలాంటి పరిస్థితుల్లో నకిలీ అగ్రిమెంట్లు బయటపడడం అందరిని కలవరపాటుకు గురిచేస్తుంది హక్కుదారులు సంతకాలు అచ్చు గుద్దినట్లుగా ఉండడం హక్కు దారునికి ఆశ్చర్యం కలిగిస్తుంది హక్కు దారుని వద్ద అన్ని పత్రాలు ఉన్నప్పటికీ నకిలీలే రాజ్యమేలుతున్నాయి నకిలీ పట్టాల తయారీ విషయంలో బద్వేల్ పోలీసులు ఇప్పటికే 20 మంది పైగా కేసులు నమోదు చేసి వారిలో కొందరిని అరెస్ట్ చేశారు ఇలాంటి పరిస్థితుల్లో నకిలీ అగ్రిమెంట్ల వెలుగులోకి రావడంతో నష్టపోతున్న అసలు హక్కుదారులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆలోచనలో ఉన్నారు నకిలీ అగ్రిమెంట్లపై కూడా ఇప్పటికే పోలీసులు రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం నకిలీ అగ్రిమెంట్ల తయారీలో మహిళలు కూడా ఉండడం అధికారులకు ఆశ్చర్యం కలిగిస్తుంది వీరికి పాత అగ్రిమెంట్ పత్రాలు ఎలా వస్తున్నాయి ఎవరు వస్తున్నారు అనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు నకిలీ పట్టాలు తయారు చేయడంలో వీరు ఆరితేరిపోయినట్లు సమాచారం నకిలీ ఇంటి పట్టాలు హక్కుదారునికి ఏ మాత్రం సంబంధం లేని నకిలీ  సంతకాలతో కూడిన అగ్రిమెంట్లు పై కూడా అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం అధికారులు రంగంలోకి దిగితే చాలా విషయాలు వెలుగులోకి వస్తాయి హక్కుదారునికి అధికారులు తీసుకునే చర్యలు వల్ల న్యాయం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది యుద్ధ ప్రాతిపదిక పై అధికారులకు అధికారులు చర్యలు తీసుకొని హక్కుదారులకు న్యాయం చేయవలసిన బాధ్యత ఉంది అధికారులు చర్యలు తీసుకోవడం మొదలు పెడితే ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి

## రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లను తొలగించిన బొందిమడుగుల సర్పంచ్ చౌడప్ప

**గ్రామాభివృద్దే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న సర్పంచ్ చౌడప్ప.**

తుగ్గలి: :తుగ్గలి మండల పరిధిలోని గల బొందిమడుగుల గ్రామంలో గ్రామ ప్రథమ పౌరుడు గ్రామ సర్పంచ్ చౌడప్ప గ్రామ అభివృద్ధి కొరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలను పొందుతున్నాడు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా బొందిమడుగుల గ్రామం నుంచి మారెళ్ల గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్ల వల్ల ప్రయాణికులకు మరియు వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నందున గ్రామ సర్పంచ్ జేసిబితో సుమారు 4 కిలో మీటర్లు రోడ్డుకు ఇరువైపులా మొత్తము కంప



చెట్లను తొలగించి చుట్టూ ప్రక్కల గ్రామ ప్రజలతో మెప్పుపొందుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చౌడప్ప మాట్లాడుతూ గ్రామభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని గ్రామాన్ని భవిష్యత్ లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని,అందుకు గ్రామ ప్రజల నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉన్నాయని తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా ఎటువంటి నిధులు లేనప్పటికీ గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఇచ్చిన మాట కొరకు త్రాగునీటి సమస్య పరిష్కారం కొరకు పైపులైన్ ఏర్పాటు చేయడం,గ్రామాలలో వీధిలైట్లు వేయడం,స్మశాన వాటికలలో ముళ్ళ చెట్లను తొలగించి శుభ్రపరచడం వంటి అభివృద్ధి పనులను గ్రామంలో నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో సర్పంచ్ చౌడప్ప ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారు.

# ఈనెల10న నంద్యాల జిల్లాలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన..



నంద్యాల ఫిబ్రవరి 03 గిరిజనుల సమస్యల పరిష్కరించేందుకు నేరుగా వారితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనడానికి ఈనెల 10వ తేదీన జిల్లాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబు, కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ అధికారికంగా జిల్లాలో పర్యటించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని స్థానిక జిపిఎస్ కార్యాలయంలో వివిధ సంఘాల నాయకులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, నాలుగు రోజులు పాటుప్రకాశం జిల్లాలో ఎస్టీ

**చెంచు కాలనీ సందర్శించి గిరిజనులతో ముఖాముఖి..**

కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభ రవిబాబు పర్యటన ముగించుకొని ఈనెల 9వ తేదీన రాత్రి మహానందికి చేరుకొని 10వ తేదీ ఉదయం స్వామివారిని చైర్మన్ కుంభ రవిబాబు, కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ లు దర్శించుకుంటారు. కమిషన్కు ఫిర్యాదు చేసిన అర్జీదారులతో మాట్లాడతారు. చెంచు గుడాలు సందర్శించి, చెంచు గిరిజనుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడున్న సమస్యలను ఆరాతీసి అడిగి తెలుసుకోనున్నారు. 12 గంటలకు పాణ్యం మండలం నేరవాడ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ స్కూల్లో  విజిట్ చేసి విద్యార్థినిలతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది. అనంతరం గిరిజన సంఘ నాయకులతో, గిరిజన ప్రజలతో వినతలు స్వీకరిస్తారు. కావున ప్రతి ఒక్క గిరిజనుడు ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటనను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లాలని జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో జిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలునాయక్, వెలుగోడు వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, కరివేన రవీంద్ర నాయక్, ఉపాధ్యక్షుడు మల్లేష్ నాయక్, ఎంపీటీసీ వెంకటేష్ నాయక్, మాజీ సర్పంచ్ బాలు నాయక్, సర్పంచ్ శివ నాయక్, విక్రమ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవన కింద ముగ్గురు విద్యార్థులకు మొదటి వాయిదా రూ. 24,63,041 జమ

తిరుపతి, ఫిబ్రవరి03:.  రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ, అగ్రవర్ణాలకు చెందిన పేద విద్యార్థులు ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యా కోర్సులు అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించే దిశలో జగనన్న విదేశీ విద్యా దీవెన అమలులో భాగంగా రాష్ట్రంలో ఈ ఏడాది టాప్ 200 విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన 213 మంది అర్హులైన విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ. 19.95 కోట్లు కంప్యూటర్ బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ నుండి నేటి శుక్రవారం ఉదయం సంబంధిత మంత్రులతో కార్యదర్శులతో కలిసి వర్చువల్ విధానంలో గౌరవ ముఖ్యమంత్రి  నగదు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయగా, తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి సంబంధిత



అధికారులతో, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందని, ఈ ఏడాదికి గాను టాప్ 200 విదేశీ యూనివర్శిటీల్లోని వాటిలో అడ్మిషన్లు పొందిన జిల్లాలోని ముగ్గురు  విద్యార్థులు ఎంపిక కాగా అందులో ఎస్సీ కేటగిరీలో ఒకరు, బి.సి కేటగిరీలో ఇద్దరు ఎంపిక అయ్యారని, విద్యార్థుల ఖాతాల్లో నేడు ముఖ్యమంత్రి బటన్ నొక్కి రూ. 24,63,041 లక్షలు జమ చేయగా జిల్లాలోని ముగ్గురు విద్యార్థులకు మొదటి వాయిదా లో భాగంగా 25శాతం మొత్తాన్ని ఎస్సీ లబ్ధిదారులు కొమ్మపూడి జీవన్ ప్రకాష్ ం– ఫరాబి కజఖ్ నేషనల్ యూనివర్సిటీ అల్మాటీ, ఖజకిస్తాన్ ఖీ ర్యాంక్ 150 ఎంబిబిఎస్ కొరకు రూ. 6,00,400, బిసి కేటగిరీ కింద రాసక్కగారి ఝాన్సీ రాణి న్యూయార్క్ యూనివర్సిటీ నందు ఎమ్మెస్ ట్రాన్స్పోర్టేషన్ ఇంజినీరింగ్ మరియు ప్లానింగ్ కోర్సు కొరకు రూ. 13,12,641, నాగవరం బాబు రంజిత్ వెస్టర్న్ యూనివర్సిటీ నందు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సెస్ కోర్సు కొరకు రూ. 5,50,000 నగదు వారి ఖాతాల్లో జమ అయిందని తెలిపారు. టాప్ 100 ఖీ ప్రపంచ ర్యాంక్ విదేశీ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం పొందిన ూఅ/ ూ/ ఃఅ/ మైనారిటీ మరియు ఇఃఅ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి మెరిట్ను ప్రోత్సహించేందుకు, ప్రభుత్వం ఎస్సీ/ ఎస్టీ/ బీసీ/ మైనారిటీ విద్యార్థులకు గరిష్టంగా  రూ. 1.25 కోట్ల వరకు, మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ. ఒక కోటి వరకు ఎంతైతే అంత వంద శాతం ట్యూషన్ ఫీజు రీయింబర్స్మెంట్ను అందిస్తోందని, టాప్ 100 నుండి 200 ఖీ ర్యాంకులతో విదేశీ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం పొందిన ూఅ/ ూ/ ఃఅ/ మైనారిటీ విద్యార్థులకు గరిష్టంగా  రూ. 75 లక్షల వరకు వంద శాతం ట్యూషన్ ఫీజ్ రీయింబర్స్మెంట్, ఇతరులకు గరిష్టంగా  రూ. 50 లక్షలు లేదా 50 శాతం ట్యూషన్ ఫీజు వీటిలో ఏది తక్కువైతే అది చెల్లింపు ద్వారా ఈ పథకం కింద విదేశాలకు వెళ్లే విద్యార్థుల విమాన ఛార్జీలు మరియు వీసా ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ. 8 లక్షలకు పెంచారని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జగనన్న విదేశీ విద్యా దీవెన లబ్ధిదారులకు రూ. 24,63,041 మెగా చెక్కును అందజేశారు.

# ఆ కాంబో.. థమన్ అతిపెద్ద డ్రీమ్

సౌత్ ఇండియాలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్ గా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న వ్యక్తి ఎస్ ఎస్ తమన్. ఏడాదికి 7 నుంచి పది సినిమాలు వరకు తమన్ మ్యూజిక్ డైరెక్టర్ గా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. వీటిలో కొన్ని మ్యూజికల్ హిట్స్ కూడా నిలుస్తున్నాయి. గత ఏడాది తమన్ నుంచి ఏకంగా తొమ్మిది సినిమాలు రిలీజ్ అయ్యాయి. అందులో కొన్ని పాటలు మాత్రం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేశాయి. ఈ ఏడాది వీర



సింహారెడ్డి సినిమాతో బ్లాక్ బాస్టర్ ఖాతాలో వేసుకున్న తమన్ ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు త్రివిక్రమ్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నాడు. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సుజిత్ కాంబినేషన్లో తెరకెక్కబోయే ఒరిజినల్ గ్యాంగ్ స్టార్ మూవీ కూడా తమను మ్యూజిక్ సమకూరుస్తున్నాడు. ఇదిలా ఉంటే తాజాగా తమన్ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబు త్రివిక్రమ్ కాంబినేషన్లో సినిమా చేయడం అనేది నా డ్రీమ్ అని తెలియజేశాడు. వారిద్దరి కాంబినేషన్లో వచ్చిన మొదటి సినిమా అతడు నుంచి కచ్చితంగా వారిద్దరితో కలిసి పనిచేయాలని భావిస్తున్నట్లుగా తెలిపాడు. అవకాశం ప్రస్తుతం తనకు వచ్చిందని కచ్చితంగా దీన్ని ప్రేక్షకులు అంచనాలు మించే విధంగా అందించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చాడు. ఈ సినిమాకి బెస్ట్ ఆల్బమ్ ఇవ్వడానికి కావలసిన స్థాయిలో తన తన సామర్థ్యాన్ని పెడతానని ఇంటర్వ్యూలో చెప్పడం విశేషం. తమన్ దృష్టి పెట్టి సంగీతం అద్భుతంగా ఇస్తే ఎంత సెన్సేషన్ ఆల్బమ్ వస్తుందనేది అలవైకుంఠపురంలో సినిమా ప్రూవ్ చేసింది. మరోసారి అంతకుమించి అనే విధంగా సూపర్ స్టార్ మహేష్ బాబు త్రివిక్రమ్ కాంబినేషన్లో సినిమాకి ఆల్బమ్ అందిస్తాడని తన మాటల ద్వారా తెలియజేశారు. పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమా తెరకెక్కబోతూ ఉండడంతో ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ అయి ఉన్నాయి. సూపర్ స్టార్ క్రి మహేష్ బాబు వరుస సక్సెస్ తో దూసుకుపోతుండగా మరోవైపు అరవింద సమేత అలవైకుంఠపురంలో సినిమాలతో త్రివిక్రమ్ కూడా వరుసహిట్లతో నడుస్తున్నాడు. వీరిద్దరి కాంబినేషన్లో వస్తున్న సినిమా కావడంతో కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుందని భావన ఆధారంగా ఉంది.

# సూర్య పాన్ ఇండియా ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్

తమిళ స్టార్ సూర్య ప్రస్తుతం శివ దర్శకత్వంలో తన 42వ సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. సూర్య గత సినిమాల యొక్క ఫలితాలతో సంబంధం లేకుండా ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. భారీ బడ్జెట్ తో కమర్షియల్ సినిమాల బాప్ అంటూ పేరు దక్కించుకున్న శివ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నాడు. కేవలం తమిళ ప్రేక్షకులు మాత్రమే కాకుండా ఈ సినిమా కోసం తెలుగు మరియు మొత్తం పాన్ ఇండియా సూర్య ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పాన్ ఇండియా లెవల్ లో భారీ ఎత్తున విడుదల కాబోతున్న ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. భారీ పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా యొక్క టైటిల్ ను ప్రకటించడంతో పాటు ఇంట్రెస్టింగ్ మోస్టర్ పోస్టర్ ను విడుదల చేసేందుకు శివ రెడీ అవుతున్నాడు అనే వార్త ప్రస్తుతం తమిళ సినీ సర్కిల్స్ లో తెగ చక్కర్లు కొడుతోంది. టైటిల్ అన్ని భాషలకు ఒక్కటే ఉండే విధంగా ప్లాన్ చేసినట్లు సమాచారం అందుతోంది. ఫుల్ స్వింగ్ లో చిత్రీకరణ జరుగుతున్న ఈ సినిమాను ఇదే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేలా దర్శకుడు ప్లాన్ చేస్తున్నాడు. సూర్య హోమ్ బ్యానర్ గా పేరున్న స్టూడియో గ్రీన్ వారితో కలిసి మన తెలుగు నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ వారు నిర్మిస్తున్న విషయం తెల్సిందే. ఇక ఈ సినిమాకు మన రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ స్వరాలు సమకూర్చుతున్నాడు. ఈ సినిమా వసూళ్లు సూర్య కెరీర్ లోనే అత్యధికంగా ఉండబోతున్నాయనే నమ్మకంను ఆయన ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు.




# ముందే తెలిసినా సూపర్ స్టార్ కోసం చేసిందట

పుష్ప వంటి భారీ పాన్ ఇండియా సూపర్ హిట్ ను తన ఖాతాలో వేసుకున్నా కూడా రష్మిక మందన్నా సంతృప్తికరమైన ఆఫర్స్ ను దక్కించుకోలేక పోతుంది. బాలీవుడ్ లో ఈ అమ్మడికి ఆఫర్లు దక్కుతున్నాయి కానీ అవేవి కూడా కమర్షియల్ గా మంచి విజయాలను సొంతం చేసుకోలేక పోయాయి. ఇక సౌత్ లో కూడా పుష్ప 2 తప్ప పెద్ద ఆఫర్లు ఆమెకు దక్కలేదు. పుష్ప 2 సినిమాలో ప్రస్తుతం నటిస్తున్న ఈ అమ్మడు ఇటీవలే సూపర్ స్టార్ విజయ్ చిత్రం వారిసు తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విజయ్ సినిమా వారిసుతో కోలీవుడ్ లో టాప్ స్టార్ గా.. మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా రష్మిక మారే అవకాశాలు ఉన్నాయని అంతా భావించారు. కానీ పాపం వారిసు సినిమాలో రష్మిక పాత్ర మరీ తక్కువగా ఉంది. వారిసులో రష్మిక పాత్ర కూరలో కరివేపాకు అన్నట్లుగా ఉండటం పట్ల ఆమె అభిమానులు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టార్ హీరోయిన్ గా మంచి పాత్రలు దక్కించుకోగల సత్తా ఉన్న రష్మిక మందన్నా ఎందుకు ఇంత చిన్న పాత్రకు ఓకే చెప్పిందో అర్థం కావడం లేదు అంటూ చాలా మంది వారిసు చూసిన తర్వాత పెదవి విరిచారు. రష్మిక మందన్నా తాజాగా వారిసులో తన పాత్ర పై వస్తున్న విమర్శలకు స్పందించింది. వారిసు కథను దర్శకుడు వంశీ పైడిపల్లి ముందుగానే నాకు చెప్పారు. కొన్ని సన్నివేశాలు మరియు రెండు పాటలకే పాత్ర పరిమితం అని కూడా తెలియజేశారు. ఐనా కూడా సూపర్ స్టార్ విజయ్ పై ఉన్న అభిమానంతో వారిసు లో నటించినట్లు రష్మిక చెప్పుకొచ్చింది. చిన్నప్పటి నుండి అభిమానిస్తున్న స్టార్ తో నటించే అవకాశం వస్తే ఎలా వదులుకుంటా అన్నట్లుగా ఆమె పేర్కొంది. విజయ్ తో మళ్లీ మళ్లీ నటించేందుకు తాను సిద్ధం అన్నట్లుగా కూడా రష్మిక కామెంట్స్ చేసింది. ఇక ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే బాలీవుడ్ లో రణబీర్ కపూర్ కు జోడీగా యానిమల్ మరియు పుష్ప 2 సినిమాలో నటించడంతో పాటు మరో వైపు ఈ అమ్మడు నితిన్ కు జోడీగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో కూడా నటించబోతున్నట్లుగా తెలుస్తోంది.



# 'హీరో'కు ఏమాత్రం తీసిపోడు! ఏం మాట్లాడుతున్నారు? నిజంగానే..



టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనికి ఉన్న అభిమాన గణం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారత్‌కు మూడు ఐసీసీ టైటిల్స్ అందించిన ఈ మిస్టర్ కూల్‌కు కోట్లాది మంది ఫ్యాన్స్ ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకొన్నప్పటికీ అతడికి ఉన్న ఫాలోయింగ్ ఇసుమంత కూడా తగ్గలేదనడంలో అతిశయోక్తి లేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌కు సారథ్యం వహిస్తున్న ధోని.. ఇప్పటికీ తన ఆటతో అలరిస్తూనే ఉన్నాడు. ఇక ఇటీవల రాంచిలో న్యూజిలాండ్‌తో మ్యాచ్ సందర్భంగా టీమిండియా అక్కడికి రాగా తలా.. తన ఎంట్రీతో భారత ఆటగాళ్లను సర్‌ప్రైజ్ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా తన సతీమణి సాక్షితో కలిసి సొంతమైదానంలో జరుగుతున్న మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించాడు. దీంతోకెమెరాలన్నీ ధోనిపైనే ఫోకస్అయ్యాయంటే అతడి మేనియా ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే.. తాజాగా ధోనికి సంబంధించిన ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీస్ డ్రెస్‌లోపోలీస్ డ్రెస్‌లో లాఠీ చేతబట్టి సహచరులతో కలిసి ధోని నడుస్తున్నట్లుగా ఉన్న ఆ చిత్రం అభిమానులను కట్టిపడేస్తోంది. ఇది చూసిన నెటిజన్లు.. "సినీ హీరోకు ఏమాత్రం తగ్గకుండా ఉన్నాడు. సింగం సిరీస్‌లో తదుపరి నువ్వే కథానాయికుడివి. రోహిత్ శెట్టి కన్ను నీపై పడటం ఖాయం భయ్యా" అంటూ కామెంట్లు చేస్తున్నారు. అయితే, ధోని ఫ్యాన్స్ మాత్రం.. "ఏం మాట్లాడుతున్నారు.. హీరోలా ఉండటమేంటి.. నిజ జీవితంలో హీరో తను'' అని అభిమానం చాటుకుంటున్నారు. కాగా ఈ ఫొటో ఓ టీవీ యాడ్‌కు సంబంధించినదిగా సమాచారం. ఎంఎస్ ధోని కెప్టెన్సీలోని భారత జట్టు 2007 టీ20 వరల్డ్‌కప్, 2011 వన్డే వరల్డ్‌కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన విషయం తెలిసిందే. సైనికుడిగానూ.. ఇక? టీమిండియా తరఫున 350 వన్డేలు, 98 టీ20లు, 90 టెస్టులు ఆడిన జార్ఖండ్ డైనమైట్ ధోని 17 వేల పరుగులు సాధించాడు. ఆగష్టు 15, 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తలా.. సీఎస్‌కే కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS** SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190